1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
సోమవారం | 22 జనవరి 2024 | www.navatelangana.com

మతుని కుటుంబానికి మిత్ర బృందం చేయూత



నవతెలంగాణ జగదేవపూర్

జగదేవపూర్ మండలం పట్టిపల్లి గ్రామంలో నిర్మల్ జిల్లా నుండి వలస వచ్చిన నిరుపేద కుటుంబం కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. విధి వక్రించి ఇటీవల పెద్ద నరేష్ మృతి చెందడంతో నిరుపేద కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న గజ్వేల్ కు చెందిన హిమగిరి ఆప్త మిత్రబృందం ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేద మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి ఆర్థిక సహాయం అందజేసి చేయూత అందించారు. నిత్యావసర వస్తువుల తో పాటు 50 కిలోల బియ్యం పెద్ద కూతురు పేరు మీద రూ.25 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు ఈ సందర్భంగా హిమగిరి ఆప్త మిత్ర బందం అరవింద్ మాట్లాడుతూ నిరుపేద కుటుంభానికి దాతలు అండగా ఉండాలని మా హిమగిరి ఆప్త మిత్ర బందం సభ్యుల సహకారంతో కొంత సహాయం అందజేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్ మల్లికార్జున్, మద్ది నరేందర్,సింగీతం అశోక్ గౌడ్, గిరిబాబు, జగదీష్, రాజేశ్వర్ రెడ్డి, బాసు, రాజు, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



నవ తెలంగాణ మిరు దొడ్డి

ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మిరుదొడ్డి పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం మిరుదొడ్డి మండల కేంద్రంలో ఆటోలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు ఆటోను తనిఖీ చేసి పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఆటోలో 8 క్వింటాల 20 కేజీల బియ్యం దొరికినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

సమాచారం వెబ్‌సైట్‌లో నిక్షిప్తం

- ఉమ్మడి మెదక్ జిల్లాలో దరఖాస్తు చేసిన కుటుంబాలు 9.42 లక్షలు
- 11 పథకాల కోసం 42.67 లక్షల అర్జీలు
- మూడు జిల్లాల్లోనూ పూర్తయిన డేటా ఎంట్రీ
- తెల్లకాగితం దరఖాస్తుల్ని ఎంట్రీ చేయని అధికారులు
- ప్రభుత్వ వెబ్‌సైట్‌లో దరఖాస్తుల సమగ్ర సమాచారం
- మార్గదర్శకాలొచ్చాకే క్షేత్ర పరిశీలనకు ఛాన్స్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తుల సమగ్ర సమాచారాన్ని ప్రత్యేక వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేశారు. కుటుంబానికి ఒకే దరఖాస్తు ఫామ్ ఇచ్చినప్పటికీ అందులో పేర్కొన్న 11 రకాల పథకాలలో లబ్దిపొందేందుకు ప్రజలు తమ వివరాలను నమోదు చేసి అర్జీ పెట్టుకున్నారు. రేషన్‌కార్డు, ఇతర సమస్యల గురించి తెల్లకాగితంపై దరఖాస్తు చేశారు. ప్రభుత్వం ముద్రించిన దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాల్ని మాత్రమే అధికారులు ప్రత్యేక వెబ్‌సైట్‌లో డేటా ఎంట్రీ చేశారు. తెల్లకాగితం దరఖాస్తుల్ని మాత్రం కంప్యూటరీకరించలేదు. ఉమ్మడి మెదక్ జిల్లాలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో 9.42 లక్షల కుటుంబాల నుంచి 11 పథకాల కోసం 42.67 లక్షల మంది దరఖాస్తు చేశారు. ఆయా గ్రామాలు, మున్సిపల్ వార్డుల వారిగా కంప్యూటరీకరణ పూర్తయ్యింది. ఏఏ పథకాల కోసం ఎంత మంది దరఖాస్తు చేశారు..? దరఖాస్తుదారు కుటుంబ సభ్యుల వివరాలు..? ఆధార్, రేషన్‌కార్డు నెంబర్లతో పాటు దరఖాస్తులో పేర్కొన్న ఇతర వివరాల్ని కంప్యూటర్‌లో ఎంట్రీ చేశారు. ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిన వెంటనే క్షేత్ర స్థాయిలో విచారించి అర్హుల్ని ఎంపిక చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించింది. డిసెంబర్ 28 నుంచి ఈ నెల 6 వరకు గ్రామాలు, మున్సిపల్ వార్డుల వారిగా ప్రత్యేక అధికారుల బృందాలు వెళ్లి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వమే ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రొఫార్మాతో దరఖాస్తుల్ని ముద్రించారు. వాటిని ఆయా గ్రామాలు, వార్డుల్లోని రేషన్‌కార్డులు, ఇంటి నెంబర్ల ఆధారంగా వారికి అందజేశారు. అదనంగా అవసరమైన వారికి కూడా దరఖాస్తులిచ్చారు. ఐదు గ్యారంటీల కోసం ప్రభుత్వం దరఖాస్తుల్ని స్వీకరించింది. ఒక కుటుంబానికి ఒకే దరఖాస్తు ఇచ్చినప్పటికీ అందులో మాత్రం 11 రకాల పథకాల గురించి కాలమ్స్ పెట్టారు. ఏఏ పథకాల కింద లబ్దిపొందాలనుకుంటున్నారో అందుకు అవసరమైన సమాచారాన్ని అందులో నింపారు. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల్ని గ్రామాల వారిగా ఎంపీడీఓ కార్యాలయానికి, వార్డుల వారిగా మున్సిపల్ కార్యాలయాలకు చేర్చారు. అట్టి దరఖాస్తుల డేటాను ప్రత్యేక వెబ్‌సైట్‌లో ఎంట్రీ చేశారు. ఈ నెల 18న డేటా ఎంట్రీ ప్రక్రియ ముగిసింది.





ఉమ్మడి మెదక్ జిల్లాలో 9.42 లక్షల కుటుంబాలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రజా పాలన కార్యక్రమంలో 942373 కుటుంబాల నుంచి దరఖాస్తులు వచ్చాయి. జిల్లాల వారిగా పరిశీలిస్తే... సిద్దిపేట జిల్లాలో 325214 దరఖాస్తులు, సంగారెడ్డి జిల్లాలో 391565 దరఖాస్తులు, మెదక్ జిల్లాలో 225594 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం ముద్రించిన దరఖాస్తు కుటుంబానికి ఒకటి మాత్రమే ఇచ్చారు. ఆ కుటుంబంలోని సభ్యులు ఏఏ పథకాల కింద లబ్దిపొందాలనుకుంటున్నారో వాటికి సంబంధించిన వివరాల్ని నమోదు చేశారు.

11 పథకాల కోసం 4267527 దరఖాస్తులు

ప్రభుత్వం రూపొందించిన దరఖాస్తులో 11 రకాల పథకాల కోసం వివరాల్ని నింపాలి. ఆ లెక్కన చూసినప్పుడు ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏ పథకం కోసం ఎంత మంది దరఖాస్తు చేశారనే వివరాల్ని పరిశీలిస్తే...అత్యధికంగా మహాలక్ష్మి పథకం కోసమే దరకాస్తు చేశారు. సంగారెడ్డి జిల్లాలో మహాలక్ష్మి పథకం కింద రూ.2500 సాయం కోసం 353391 మంది, రూ.500 సబ్సిడీ గ్యాస్ కోసం 341888 మంది, రూ5 లక్షలతో నిర్మించే ఇందిరమ్మ ఇళ్ల కోసం 324558 మంది, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం 314752 మంది, రైతు భరోసా కింద రూ.15 వేల పెట్టుబడి సాయం కోసం 164315 మంది రైతులు, రూ.12 వేల సాయం కోసం 145891 మంది కూలీలు దరఖాస్తు చేశారు. ఇతర పథకాల కోసం మాత్రం వేలల్లోనే దరఖాస్తులు వచ్చాయి. సిద్దిపేట జిల్లాలో అత్యధికంగా రూ.500 సబ్సిడీ గ్యాస్ కోసం 283767 మంది, రూ.2500 ఆర్థిక సాయం కోసం 250915 మంది, ఇందిరమ్మ ఇళ్ల కోసం 236014 మంది, ఉచిత విద్యుత్ కోసం 267734 మంది, రైతు భరోసా కోసం 172414 మంది రైతులు, 144818 మంది కూలీలు దరఖాస్తు చేశారు. ఇతర పథకాల కోసం వేలల్లోనే దరఖాస్తులొచ్చాయి. మెదక్ జిల్లాలో కూడా అత్యధికంగా సబ్సిడీ గ్యాస్ కోసం 195297 మంది, రూ.2500 ఆర్థిక సాయం కోసం 187808 మంది, ఇందిరమ్మ ఇళ్ల కోసం 193096 మంది, ఉచిత విద్యుత్ కోసం 173934 మంది, రైతు భరోసా కింద 145709 మంది రైతులు, 126343 మంది కూలీలు దరఖాస్తు చేశారు.

దరఖాస్తులో పేర్కొన్న 11 రకాల పథకాల కోసం ఉమ్మడి మెదక్ జిల్లాలో వచ్చిన అర్జీలు

ఐదు గ్యారంటీ పథకాలు	సంగారెడ్డి	మెదక్	సిద్దిపేట	మొత్తం
మహాలక్ష్మి (రూ.2500)	353391	187808	250915	792114
మహాలక్ష్మి (రూ.500)	341888	195297	283767	820946
రైతు భరోసా (రూ.15000)	164315	145709	172414	482438
కౌలు రైతులు	9739	6579	8033	24351
కూలీలు (రూ.12000)	145891	126343	144818	417052
ఇందిరమ్మ ఇళ్లు (రూ.5 లక్షలు)	324558	193096	236014	753668
అమరవీరుల ఇంటి స్థలం	854	405	556	1815
ఉద్యమకారుల ఇంటి స్థలం	2574	2227	3775	8576
ఉచిత విద్యుత్(200 యూనిట్లు)	314752	173934	267734	756420
చేయూత దివ్యాంగులు	7864	4683	6735	19282
ఇతర పింఛన్లు	62151	46959	81755	190865
మొత్తం				4267527

ఉమ్మడి మెదక్ జిల్లాలో స్వీకరించిన దరఖాస్తులు

మెదక్	225594
సిద్దిపేట	325214
సంగారెడ్డి	391565
మొత్తం	942373

తెల్లకాగితం దరఖాస్తులు నో ఎంట్రీ

ప్రజా పాలనలో ప్రభుత్వం ముద్రించిన దరఖాస్తు ఫామ్‌తో పాటు తెల్లరేషన్‌కార్డుల మంజూరీ, పాతకార్డులో పేర్ల నమోదు కోసం, ధరణి భూ సమస్యలు ఇతర విషయాల గురించి కూడా తెల్లకాగితంపై దరఖాస్తులు స్వీకరించారు. ప్రభుత్వం ఇచ్చిన దరఖాస్తులతో పాటు తెల్లకాగితంపై రాసిన దరఖాస్తుల్ని కూడా అధికారులు స్వీకరించి వాటిని ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాలకు తీసుకొచ్చారు. ప్రభుత్వం ముద్రించిన దరఖాస్తులకు ప్రత్యేకమైన నెంబర్ ముద్రించబడి ఉంది. ఆ నెంబర్ ఆధారంగా ఒక్కో దరఖాస్తులో 11 రకాల పథకాల కోసం ఇచ్చిన సమాచారాన్ని మాత్రమే కంప్యూటర్‌లో నమోదు చేశారు. తెల్లకాగితంపై ఇచ్చిన దరఖాస్తులకు ఏలాంటి ఆధారిత నెంబర్ లేకపోవడంతో వెబ్‌సైట్‌లో ఎంట్రీ చేసేందుకు ఆప్షన్ ఇవ్వలేదు. దీంతో ప్రజల నుంచి తీసుకున్న తెల్లకాగితం దరఖాస్తుల్ని అధికారులు కంప్యూటర్‌లోఎంట్రీ చేయకుండా కట్టలు కట్టి భద్రపరిచారు. తెల్లకాగితం దరఖాస్తుల ఎంట్రీ గురించి అధికారులకు ఏలాంటి మార్గదర్శకాలు రాలేదు.

ఎడిట్ ఆప్షన్ ఇవ్వకపోవడంతో తప్పుల నమోదుకు ఛాన్స్

ప్రజా పాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ కోసం ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించింది. అందులోనే దరఖాస్తుల సమాచారాన్ని ఎంట్రీ చేశారు. 6న దరకాస్తుల స్వీకరణ ముగియగానే మరుసటి రోజు నుంచి ఈ నెల 17 వరకు డేటా ఎంట్రీ చేశారు. ప్రత్యేకమైన సిబ్బందిని పెట్టి డేటా ఎంట్రీ చేయించారు. ఆయా గ్రామాల దరఖాస్తుల్ని కంప్యూటర్ ఆపరేటర్‌తో పాటు పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది, మున్సిపల్ పరిధిలో వార్డు అధికారి, సిబ్బంది సహాయంతో డేటా ఎంట్రీ చేశారు. దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాలను కంప్యూటర్‌లో ఎంట్రీ చేసే సమయంలో ఏదైన తప్పు ఎంట్రీ అయితే దానిని సరిచేసేందుకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వలేదు. దీంతో సమాచార నమోదులో తప్పులు దొర్లి ఉంటాయని చెబుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి



నవతెలంగాణ సిద్దిపేట అర్బన్

కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర సహాయ మూడ్ శోభన్ నాయక్, సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాల స్వామి అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం), కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక కర్షక మైత్రి జిల్లా సదస్సు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొంగరి వెంకట్ మావో, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుపతి రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా కరపత్రాల ద్వారా ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ నెల 26న అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్, వాహనాల ర్యాలీలు నిర్వహించాలన్నారు. అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న 29 చట్టాలను కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం కుదించి నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకువచ్చిందన్నారు. వీటివల్ల కార్మికులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. యాజమాన్యాలకు ఉపయోగపడుతుందన్నారు. రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కోరుకుంటున్నారని అన్నారు. బడ్జెట్లో వ్యవసాయ రంగానికి, ఉపాధి హామీ పథకానికి నిధులలో కోత పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని, వాటిని నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఖాళీ పోస్టులను కూడా భర్తీ చేయలేదన్నారు. పైగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఉన్న ఉపాధి అవకాశాలు కూడా కోల్పోయారన్నారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె రైతు కూలీ సంఘాల ఆధ్వర్యంలో గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కేంద్ర నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. కార్పొరేట్లని తరిమికొట్టాలన్నారు. దేశాన్ని రక్షించాలనే నినాదంతో జరిగే ఈ ఆందోళనలో అన్ని కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ, మహిళా, విద్యార్థి లోకమంతా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో వ్యాకాస సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డి, సిఐటియు జిల్లా కోశాధికారి జి భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, జిల్లా సహాయ కార్యదర్శిలు చొప్పరి రవికుమార్, ఇప్పకాయల శోభ జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాలనర్సయ్య,రంగా రెడ్డి, కనకయ్య, భాస్కర్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు శ్రీనివాస్, కనకాచారి, శోభ, కనకయ్య, గొర్రె శ్రీనివాస్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తిని హత్య చేసిన దుండగులు






నవతెలంగాణ జగదేవపూర్

బేరానికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి మూడు రోజుల తర్వాత చెరువులో శవమైతేలిన సంఘటన జగదేవపూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. జగదేవపూర్ మండల పరిధిలోని పీర్లపల్లి గ్రామానికి చెందిన ఎర్ర కర్ణాకర్(28) కట్టెల బేరం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 18వ తేదీన భార్యకు చెప్పి వ్యాపారం పని మీద బయటకు వెళ్లాడు. మూడు రోజులుగా ఇంటికి వెళ్లలేదు. కుటుంబీకులు వెతికినా అతని ఆచూకీ లభించలేదు. జగదేపూర్ గ్రామానికి చెందిన కొందరు కరుణాకర్‌పై దాడి చేశారని ప్రచారం జరిగింది. జగదేవపూర్ గ్రామంలో కర్ణాకర్‌కు చెందిన సెల్ అమ్ముతుండగా చూడడంతో పీర్లపల్లి గ్రామ వ్యక్తి చూసి గ్రామస్తులకు తెలియజేశాడు. విషయం తెలుసుకున్న కర్ణాకర్ కుటుంబీకులు సెల్ అమ్ముతున్న వ్యక్తిని నిలదీశారు. కర్ణాకర్‌ను గురువారం హత్య చేసి జగదేవపూర్‌లో గల రెడ్డి ఏమైనా చెరువులో వేసినట్లు అతను అంగీకరించాడని గ్రామస్తులు తెలిపారు. వెంటనే ఆ వ్యక్తిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అతనితో పాటు మరొకతను కలిసి కర్ణాకర్‌ను హత్య చేసినట్లుగా ఒప్పుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. జగదేవపూర్‌లో గల ఓ మద్యం దుకాణం ముందు బంధువులతో కలిసి కర్ణాకర్ మందు తాగాడు. ఈ విషయాన్ని జగదేవపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అతన్ని గమనించారు. అనంతరం అతని వద్ద గల రూ.30 వేలు తీసుకొని అతన్ని సుమారు 9 గంటల తరువాత కొట్టి చంపినట్లు తెలిపారు. హత్య చేయబడ్డ ఎర్ర కర్ణాకర్ కుటుంబ సభ్యులు రోడ్డు మీద ధర్నా చేస్తూ పోయిన ప్రాణం ఎట్లాగూ రాదు.. ఉన్నవారికి న్యాయం చేయుండంటూ ఒక విధంగా బేరసారాలకు ఆ ఊరు జనాలు మాట్లాడసాగారు. ఎవరూ ముందుకు రాకపోవడంతో న్యాయం చేయాలంటూ ధర్నాకు దిగారు. బాధిత కుటుంబ సభ్యులు నిందితులను కఠినంగా శిక్షించాలని, తమకు నిందితులను అప్పగించాలంటూ పోలీస్‌స్టేషన్ ఎదుట సుమారు అరగంట పాటు ధర్నా నిర్వహించారు. దీనితో రోడ్డుపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో గజ్వేల్ ఏసీపీ రమేష్, గజ్వేల్ సీఐ జాన్‌రెడ్డి, రూరల్ సీఐ జానకి రామ్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వారు ఎంతకు వినకపోవడంతో పీర్లపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కేసిరెడ్డి రవీందర్‌రెడ్డి జోక్యం చేసుకొని బాధితులకు నచ్చజెప్పడంతో ధర్నా విరమించుకున్నారు.

విచారణ చేసి పూర్తి వివరాలు వెల్లడిస్తాం: ఏసీబీ రమేష్


జరిగిన సంఘటనపై విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని ఏసీపి రమేష్ తెలిపారు. హత్యలో పాల్గొన్న జగదేవపూర్ గ్రామానికి చెందిన కొంపల్లి నాగరాజు, రాగుల గణేష్‌లను అరెస్ట్ చేశామన్నారు. విచారణ తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. అనంతరం నిందితులను జైలుకు తరలిస్తామని తెలిపారు. జగదేవపూర్ ఎస్సై చంద్రమోహన్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సిద్ధాంతాన్ని అమలు చేసిన మహనీయుడు లెనిన్




నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

మార్క్సిజాన్ని ఆచరణలో అమలు చేసి కష్ట జీవులను దోపిడీ నుంచి విముక్తి చేసిన గొప్ప మహనీయుడు లెనిన్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యాలయంలో వీఐ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ దోపిడీ, కష్టాల నుంచి ప్రపంచ మానవాళిని విముక్తి చేసే గొప్ప సిద్దాంతం మార్క్సిజం అని, అలాంటి సిద్ధాంతాన్ని నిర్దిష్ట పరిస్థితులకనుగుణంగా అమలు చేసి కార్మిక విప్లవాన్ని జయప్రదం చేసి సోషలిజాన్ని నిర్మించిన పోరాట యోధుడు, సిద్ధాంత కర్త అని అన్నారు. పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయ సిద్ధాంతం ఉందని, అంతరాలు లేని సమాజం నిర్మాణం సాధ్యమేనని ఆచరణలో నిరూపించిన నాయకుడని అన్నారు. మార్క్సిజం అనేది ప్రకృతి ఆధారంగా ఏర్పడ్డ సిద్దాంతం అని, విశ్వ వ్యాపిత సిద్ధాంతం అని అన్నారు. రష్యాలో సోషలిజం నిర్మించిన ఆచరణవాది అని అన్నారు. రష్యా విప్లవ స్ఫూర్తితో అనేక దేశాలలో పరాయి పరిపాలన పీడన నుండి విముక్తి గావించాయన్నారు. లెనిన్ స్ఫూర్తితో కార్మిక వర్గ పోరాటాలు జయప్రదం చేయాలన్నారు. దోపిడీ లేని, అంతరాలు లేని సమసమాజం నిర్మాణానికి కార్యకర్తలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్ళబండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య,శెట్టిపల్లి సత్తిరెడ్డి జిల్లా కమిటీ సభ్యులు చోప్పరి రవి కుమార్.దాసరి ప్రశాంత్,నాయకులు జాలిగాపు శిరీష,వంగ రవీందర్ రెడ్డి,ఆంజనేయులు,పవన్ తదితరులు పాల్గొన్నారు.




నవతెలంగాణ-సంగారెడ్డి

సామ్రాజ్యవాదం, మతోన్మాదం, పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా లెనిన్ స్ఫూర్తితో ప్రజలు ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి సభను పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా లెనిన్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. అనంతరం జయరాజు మాట్లాడుతూ.. ప్రపంచ మానవాళి విముక్తికి మహోన్నత సిద్ధాంతాన్ని మార్క్స్, ఏంగెల్స్‌లు అందిస్తే.. దానిని ముందుకు తీసుకెళ్లి అమలు చేసిన గొప్ప వ్యక్తి లెనిన్ అని అన్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటి సామ్యవాద కలను సాకారం చేసిన ఘనత లెనిన్‌కు దక్కుతుందన్నారు. ఆయన జీవించింది కేవలం యాభై నాలుగేండ్లే అయినా వందేళ్ల తర్వాత కూడా ఆయన అందించిన విప్లవ స్ఫూర్తి నేటికీ కొనసాగుతున్నదన్నారు. ప్రపంచంలోనే తొలి సోషలిస్టు వ్యవస్థ ఆవిర్భావం రష్యాలో లెనిన్ నాయకత్వంలో జరిగిందన్నారు. మహిళలు, కార్మికులు, రైతంగా సమస్యలను లోతుగా అధ్యయనం చేశారన్నారు. కానీ నేడు దేశంలో మతోన్మాద బీజేపీ ప్రజల మధ్య చిలికలు పెట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు వ్యక్తులకు అమ్మివేస్తున్నదన్నారు. రాజ్యాంగ లౌకిక విలువలను తుంగలో తొక్కుతున్నదని విమర్శించారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఉద్యమించాలన్నా రు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేశం, మానిక్, సాయిలు, నాయకులు యాదగిరి, నర్సింహులు, అశోక్, కష్ణ, రమేష్ గౌడ్, రమేష్, పుండ్లిక్, దత్తు పాల్గొన్నారు.



నవతెలంగాణ - మెదక్

రష్యన్ విప్లవ పోరాటయోధుడు కామ్రేడ్ లెనిన్ అని సీపీఎం మెదక్ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం పేర్కొన్నారు. ఆదివారం మెదక్ పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో లెనిన్ శత వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రష్యన్ విప్లవం తీసుకురావడంలో లెనిన్ పాత్ర కీలకమన్నారు. మార్క్స్, ఎంగెల్స్ సమాజ సూత్రాలకనుగునంగా కార్మిక, కర్షక మైత్రిని పెంపొందించడం ద్వారా రష్యాలో జార్జ్ చక్రవర్తికి వ్యతిరేకంగా లెనిన్ పోరాటం చేసి విజయం సాధించినట్లు తెలిపారు. అనేక దేశాలకు ఈ విప్లవం మార్గదర్శకంగా నిలిచిందన్నారు. భారతదేశంలోని పరిస్థితులకు లెనిన్ సూత్రాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. ప్రస్తుతం వాటిని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కమ్యూనిస్టు గ్రూపులన్నీ ఐక్యం కావాలన్నారు. కమ్యూనిస్టు పార్టీలను పటిష్టంగా నిర్మించాలని లెనిన్ చెప్పాడని గుర్తుచేశారు. కార్మిక, కర్షక మైత్రిని పెంపొందించడం కోసం భారతదేశంలో సంయుక్తా కిసాన్ మోర్చా ఏర్పడి, కార్మిక సంఘాలన్నీ కలుపుకొని ఇప్పటికే పోరాటాలు చేస్తున్నాయన్నారు. దానికి అనుగుణంగానే ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా సమ్మె-గ్రామీణ బంద్‌ను పారిశ్రామిక, ఉద్యోగులు ఒకరోజు సమ్మె కార్యక్రమాన్ని తీసుకోబోతున్నట్లు తెలిపారు. లెనిన్ ఆశయాలను ముందుకు తీసుకుపోవడం కోసం సీపీఎం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే. మల్లేశం, బి. బసవరాజు, జిల్లా కమిటీ సభ్యులు కే. నర్సమ్మ, జే. సంతోష్, నాయకులు సత్యం, జగన్, అజయ్, దుర్గా పాల్గొన్నారు.



నవతెలంగాణ-చేర్యాల

సామ్రాజ్యవాదం మానవాళి వినాశనానికి దారి తీస్తుందని సీపీఐ(ఎం)చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో అన్నారు. కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా ఆదివారం చేర్యాల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో లెనిన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట మావో మాట్లాడుతూ కామ్రేడ్ లెనిన్ కార్మిక, కర్షక ఐక్యతను చాటుతూ సామ్రాజ్యవాదం మానవాళికి, మానవ మనుగడకు అత్యంత ఆటంక కరమైన ప్రమాద కారి అని ఆనాడే గుర్తించి రష్యాలో వీరోచితంగా పోరాడి 1906 లో విప్లవాన్ని సాధించిన మహోన్నతుడని,ఆయన పట్టుదలను ప్రపంచం మొత్తం కొనియాడిందని తెలిపారు.నేడు ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదం, ప్రైవేటీకరణ పేరుతో మనుషుల మధ్యన అంతరాలు సష్టించి కోటీశ్వరులు శతకోటీశ్వర్లుగా చేస్తూ ,పేదలను మరింత పేదలుగా దిగజార్చే విధంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు.మనదేశంలో సమ సమాజ స్థాపన కోసం ప్రజలకు విద్యా ,వైద్యం ,ఉపాధి, కూడు, గూడు దక్కే విధంగా కార్మిక, కర్షక ఐక్యతతో ఈ సామ్రాజ్యవాదుల కుట్రలను భగ్నం చేస్తూ నాడు లెనిన్ రూపొందించిన పోరాట విధానాన్ని నేడు అమలు చేస్తూ ప్రజా పోరాటాలను ఉదతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బండ కింది అరుణ్ కుమార్, గొర్రె శ్రీనివాస్, పోలోజు శ్రీహరి,ముస్త్యాల ప్రభాకర్, కత్తుల నర్సిరెడ్డి ,ఆముదాల రంజిత్ రెడ్డి, సుదగాని నర్సింలు, రాళ్ల బండి చందు,మేర్గోజు ప్రవీణ్,మైసంపల్లి రాహుల్ ,ఇప్పకాయల శోభ, కర్రోళ్ల కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మార్కులు సాధించాలి

- ఎమ్మెల్యే హరీశ్‌రావు

నవ తెలంగాణ - సిద్దిపేట



సిద్దిపేట నియోజకవర్గం అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుస్తుందని, పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు ఉత్తరాలు రాసి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చ్ 18 నుండి పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల తల్లి తండ్రులకు ఆత్మవిశ్వాసం నింపేల, విద్యార్థులకు మనో ధైర్యం నీచ్చేల ఉత్తరం రాసినట్లు తెలిపారు. పిల్లలు ఇంటి వద్ద శ్రద్ధ గా చదివించాలనీ, ఈ రెండు నెలలు టీవీలు చూడకుండా, సెల్ ఫోన్ లు వాడకుండా బంజేయించాలని ఉత్తరం లో పేర్కొన్నట్లు తెలిపారు. పిల్లలు విందు వినోదాలకు, ఫంక్షన్స్ కు దూరంగా ఉంచండని చెప్పారు. నా వంతు గా విద్యార్థుల కు ప్రత్యేక తరగతులు తో పాటు, సాయంత్రం వేళలో ఆల్పాహారం ఏర్పాటు చేపిస్తున్నట్లు తెలిపారు. కష్టంగా కాకుండా ఇష్టంగా చదివించండనీ, మీ పిల్లలు బంగారు భవితకు బాటలు వేయండనీ, అది మీ చేతుల్లోనే ఉందని ఉత్తరంలో తల్లిదండ్రులను కోరినట్లు తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గిరిబాబుకు ఘన సన్మానం

నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేటకు చెందిన రంగస్థల, రేడియో, టీవీ, సినిమా నటుడు, టీఎస్ యుటిఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి దేవులపల్లి గిరిబాబు అద్భుతమైన నటన కనబరిచి ఉత్తమ సహాయ నటుడు అవార్డు అందుకున్నందుకు ఘనంగా సన్మానించినట్లు టీఎస్ యుటిఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తాప్పెట్ల యాదగిరి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా కేంద్రంలో జరిగిన నంది నాటకోత్సవాలలో చైతన్య కళా భారతి కరీంనగర్ వారి చీకటిపువ్వు నాటిక ఉత్తమ ప్రదర్శన అవార్డులు గెలుచుకుందని, బాపట్ల జిల్లాలో జరిగిన తెలుగు రాష్ట్రాల జాతీయ స్థాయి నాటకోత్సవాలలో చీకటి పువ్వు నాటిక 5 అవార్డులు గెలుచుకుందని, ఇందులో సిద్ధార్థ్ పాత్రలో దేవులపల్లి గిరిబాబు అద్భుతమైన నటన కనబరచినట్లు తెలిపారు. ఉత్తమ సహాయ నటుడు మరియు వేరు వేరు నాటక పరిషత్ లలో ఎన్నో జ్యూరీ బహుమతులు గెలుచుకున్నారన్నారు. గిరిబాబు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా బెజ్జంకి మండలం కల్లేపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ, విద్యార్థులకు సామాజిక అంశాలపై కళాన త్యాలు చేయిస్తూ, విద్యార్థులకు చదువుతోపాటు సహ పాఠ్యాంశాలలో మేలుకొలవలు నేర్పడం అభినందనీయమన్నారు. గిరిబాబు చిన్నప్పటి నుండి నటనపట్ల ఆసక్తితో నిజాం కాలేజీలో థియేటర్ ఆర్ట్స్ కోర్స్ పూర్తి చేసి, ఇప్పటివరకు 100పైగా నాటక ప్రదర్శనలు చేసి పలువురి నాటక పెద్దలందరితో ప్రశంశలు అందుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ సిద్దిపేట జిల్లా కోశాధికారి ఎం కృష్ణ, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శివలింగం, ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ కన్వీనర్ కే కనకరాజు, సోషల్ మీడియా కన్వీనర్ జి ప్రవీణ్ కుమార్, జిల్లా ప్రచురణాల కమిటీ కన్వీనర్ ఈ .తిరుపతి, జిల్లా కమిటీ సభ్యులు జే. నరసింహులు, బి. గణేష్ రెడ్డి , ఎం .శివుడు, ఎస్. యాదగిరి, బి. రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ఓటర్ నమోదు ప్రక్రియకు విశేష స్పందన



నవతెలంగాణ-బెజ్జంకి

కరీంనగర్ జిల్లా పరిపాలనాధికారి ఆదేశం మేరకు మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన ప్రత్యేక ఓటర్ నమోదు ప్రక్రియకు విశేష స్పందన లభించినట్టు తహసిల్దార్ ఎర్రోల్ల శ్యామ్ తెలిపారు. అదివారం మండలంలోని అయా గ్రామాల్లో చేపట్టిన ప్రత్యేక ఓటర్ నమోదు ప్రక్రియను తహసిల్దార్ శ్యామ్ క్షేత్ర స్థాయిలో సందర్శించి పరిశీలించారు.మండల వ్యాప్తంగా ఫారం 6 కు 25,ఫారం 8 కు 2 దరఖాస్తులు స్వీకరించినట్టు తహసిల్దార్ తెలిపారు.ప్రత్యేక ఓటర్ నమోదు ప్రక్రియలో అయా గ్రామాల్లోని బీఎల్ఓలు అందుబాటులో ఉండి విజయవంతం చేశారని తహసిల్దార్ అభినందించారు.

కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటాం



నవతెలంగాణ-జహీరాబాద్

కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. ఆదివారం జరిగిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఉద్యమ కారుడు తులసి దాస్ గుప్తా కూతురి నూతన వస్త్రధారణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాలొని చిన్నారిని ఆశీర్వదించారు. చిన్నారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ లావణ్య చందు, పట్టణ మాజీ అధ్యక్షులు యాకూబ్, మాజీ కౌన్సిలర్‌లు నామ రవికిరణ్, రాములు నేత, బండి మోహన్, మోతిరాం, అబ్దుల్లా, ఝూన్గిర్,యూనిస్ బీఆర్ఎస్ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు శివప్పా, సీనియర్ నాయకులు కలీమ్, అక్రమ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సునితారెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం



నవతెలంగాణ-హత్నూర

అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిందని స్థానిక ఎమ్మెల్యే సునీతా రెడ్డి విమర్శించడం హాస్యాస్పదంగా ఉన్నదని టీపీసీసీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.హకీమ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరు గ్యారెంటీలు ప్రతీ అర్హుడికి చేరాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారన్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యే సునితారెడ్డి అది జీర్ణించుకోలేక బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ప్రోటోకాల్ సమస్య వస్తున్నదని విమర్శిస్తున్నారన్నారు. ప్రభుత్వం పై విమర్శలు మాని అభివృద్ధి పై దృష్టి పెట్టాలని సూచించారు. పదేండ్లు గుర్తుకు రాని ప్రోటోకాల్.. ఇప్పుడు గుర్తొస్తుందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంచార్జిల వ్యవస్థ తెచ్చి ప్రశాంత వాతావరణం చెడగొడుతున్నారని మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చెప్పడం విడ్డురంగా ఉన్నదన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మదన్‌రెడ్డి కూడా ఇంచార్జిగా ఉన్నాడని.. ఆ విషయం మర్చిపోవద్దన్నారు.



ఖేడ్ ఎమ్మెల్యే ఇంటికి జుక్కల్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోల సంజీవరెడ్డి స్వగృహానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదివారం వచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతారావుకు ఖేడ్ ఎమ్మెల్యే సోదరుడు పట్లోల సుధాకర్‌రెడ్డి ఘనస్వాగతం పలికి.. సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ.. వారి అమ్మమ్మతో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గ్రామస్తులతో తనకున్న పరిచయాలను గుర్తు జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో యువ నేతలు మాజీ జిల్లా ప్రణళిక సభ్యులు యం.రవికుమార్, అన్వేష్ రెడ్డి, లోకేష్ రెడ్డి, బోజిరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, షాదుల్ మాజీ ఎంపీపీ, ఎంపీపీ తనయుడు రమేష్ చౌహన్, పండరి రెడ్డి మాజీ ఎంపీటీసీ, సర్పంచ్ తనయుడు సామెల్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

హనుమండ్లు సేటును పరామర్శించిన జెడ్పీటీసీ



నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని కృష్ణాపూర్ గ్రామా నికి చెందిన హనుమండ్లు సేటు అనా రోగ్యంతో బాధపడుతూ సూరారం మల్లారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కల్హేర్ జెడ్పీటీసీ నరసింహారెడ్డి ఆదివా రం మల్లారెడ్డి ఆసుపత్రికి వెళ్లి హనుమండ్లు సేటును పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి కుమారుడు సురేష్ సేటుకు ధైర్యం అందించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో గల పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రవికుమార్ ఆదివారం పరిశీలించారు. ఓటర్ నమోదు కార్యక్రమం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పోలింగ్ కేంద్రాల స్థితిగతులు, తదితర అంశాల పై ఆరా తీశారు. రెవెన్యూ సిబ్బంది, బీఎల్ఓ బృందాలకు సూచనలు చేశారు.

నామమాత్రంగా 'ఓటరు అవగాహనా' కార్యక్రమాలు



నవతెలంగాణ-జహీరాబాద్

ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నూతన ఓటర్ల నమోదు, మార్పులు చేర్పుల కోసం చేస్తున్న కార్యక్రమాలకు ప్రజాప్రతినిధుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో నామమాత్రంగా కొనసాగుతున్నాయి. మండలంలోని గోవింద్పూర్‌లో ఆదివారం ఓటర్ల అవగాహనా కార్యక్రమం చేపట్టగా.. స్థానిక సర్పంచ్, అధికారులు ఎవరూ కూడా సరిగా పట్టిం చుకోకపోవడంతో నామమాత్రంగా కార్యక్రమాన్ని నడిపించి వెళ్లిపోయారు. కళాకారులు పాటలతో ఓటుపై అవగాహన కల్పించాలని ప్రయత్నించగా.. ప్రజల నుంచి స్పందన రాకపోవడంతో నిరాశగా అక్కడినుంచి వెళ్లిపోయారు. ఈ కళాజాతలో సభ్యులు మదన్, సాయిలు, రాములు, చంద్రం, శశి ప్రియ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

త్రివిక్రమ్ బహిరంగ క్షమాపణ చెప్పాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

గుంటూరు కారం సినిమాలో విలన్ పాత్రధారులకు ప్రపంచ పోరాట మార్గదర్శకులు మార్క్స్, లెనిన్ పేర్లను పెట్టడం సరికాదని.. ఆ సినిమా దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని టీసీపీఐ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ చారీ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సంగారెడ్డిలో మాట్లాడుతూ.. ప్రపంచంలోనే విప్లవ పోరాటాలకు మార్గదర్శకులు అయిన లెనిన్, మార్క్స్‌లను కించపరిచే విధంగా విలన్ పాత్రలకు వారి పేర్లు పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. నిజాలను వక్రీకరించే విధంగా నేడు సినిమాలు తీస్తున్నారని ఆరోపించారు. త్రివిక్రమ్ శ్రీనివాస్‌కు చిత్తశుద్ధి ఉంటే ప్రపంచ మానవాళి విప్లవాలకు బాటలు వేసిన మార్క్స్, లెనిన్‌ల జీవితాల ఆధారంగా సమాజానికి ఉపయోగపడేలా సినిమా తీయాలని డిమాండ్ చేశారు. వెంటనే దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పాత కక్షలతో యువకుడి హత్య



నవతెలంగాణ-రాయికోడ్

పాత కక్షలతో ఓ యువకుడిని కత్తితో నరికి హత మార్చిన ఘటన మండల పరిధిలోని సింగీతం గ్రామంలో జరిగింది. స్థానిక ఎస్సై వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సింగీతం గ్రామానికి చెందిన కర్చల్ రవి(25)కి, అలిగే రాజుకు మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. అయితే శనివారం సాయంత్రం గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ దగ్గర రవి ఉండడాన్ని రాజు గమనించాడు. పాత కక్షలను మనస్సులో పెట్టుకుని తన ఇంట్లో ఉన్న కమ్మ కత్తితో రవిపై రాజు దాడి చేశాడు. మెడపైన, ముఖంపైనా, తలపైనా కత్తిగాట్లు పడడంతో వెంటనే అతడిని స్థానికులు జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అక్కడినుంచి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి తమ్ముడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై చెప్పారు.

రాష్ట్ర సదస్సుకు తరలివెళ్లిన టీజేఎస్ నేతలు



నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ జనసమితి(టీజేఎస్) అధ్యక్షులు ప్రొ.కోదండరామ్ ఆధ్వర్యంలో ఆదివారం హైద్రాబాద్‌లో నిర్వహించిన టీజేఎస్ రాష్ట్ర సదస్సు కార్యక్రమానికి సంగారెడ్డి నుంచి జిల్లా అధ్యక్షుడు పీ.తుల్జారెడ్డి ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. తరలి వెళ్ళిన వారిలో టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి సాయిలు, సమన్వయకర్త శ్రీధర్ మహేంద్ర, నాయకులు నరేష్, కొండాపూర్ మండల నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, వట్పల్లి మండల నాయకులు శ్రీకాంత్ రెడ్డి, రాజు సంగారెడీ నాయకులు మహేశ్వర్ రెడ్డి, సంగమేశ్వర్ రెడ్డి, కంది మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు కేసులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

డీఎంహెచ్ఓ అవినీతిని ప్రశ్నిస్తే ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ నాయక్‌పై తప్పుడు కేసులు పెట్టిస్తున్న అధికారిణిపై కఠిన చర్యలు తీసుకోవాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రకాష్ రాథోడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సురేష్ నాయక్, నియోజకవర్గ అధ్యక్షులు శ్రీనివాస్ రాథోడ్, నాయకులు మోహన్, రాజు, వినోద్, రవి తదితరులు పాల్గొన్నారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు



- కానరాని రక్షణ చర్యలు.. కొరవడిన నియంత్రణ..
- పట్టించుకోని అధికారులు, పాలకులు

నవతెలంగాణ-ఝరాసంగం

వాహనదారులతో నిత్యం రద్దీగా ఉండే రహదారులు.. భద్రతా చర్యల కొరత కారణంగా ప్రమాదకరంగా మారీ ఎంతోమంది ప్రాణాలను బలిగొంటున్నాయి. ప్రధాన రహదారుల మధ్య ఉండే ప్రమాదకర మలుపుల వద్ద కనీస రక్షణ చర్యలు లేకపోవడంతో.. ఆ మలుపులే ప్రమాదాలకు పిలుపులుగా మారుతున్నాయి. ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా.. అధికారులు గానీ, పాలకులు గానీ పట్టించుకున్న పాపాన పోవట్లేదు. ఝరాసంగం మండలంలోని క్రిష్ణపూర్ నుంచి కప్పాడ్ వెళ్ళే రహదారిపై ఇలాంటి దుస్థితే నెలకొ న్నది. భయకరంగా ఉన్న మలుపులతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి.. మలుపుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

క్రిష్ణపూర్ నుంచి కప్పాడ్ వెళ్ళే ఈ రహదారి ద్వారా జహీరాబాద్ పట్టణం నుంచి ఝరాసంగం మండలం మీదుగా రాయికోడ్, నారాయణఖేడ్ పట్టణానికి,వట్పల్లి, రేగోడు, అల్లాదుర్గ్, మెదక్ జిల్లాకు నిత్యం ప్రజలు ప్రయాణా లు కొనసాగిస్తారు. అంతే కాకుండా ఝరాసంగం మండల కేంద్రం నుంచి చాలా గ్రామాలకు ప్రజలు ప్రయాణాలు చేస్తుంటారు. దాంతో ఈ రహదారి నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. అయితే ఈ దారిలోని ప్రమాదకర మలుపుల వద్ద పిచ్చి మొక్కలు పెరగడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్నింటిని తొలగించినప్పటికి మరికొన్ని మలుపుల వద్ద ఆ పిచ్చి మొక్కలను అలాగే ఉంచేశారు. 'ప్రమాదకర మలుపులు ఉన్నాయి... నెమ్మదిగా వెళ్ళండి' అంటూ హెచ్చరిక బోర్డులు కూడా అమర్చలేదు. దానికి తోడు ఇటీవలే రహదారిని ఆధునీకరించడంతో వాహనదారుల వేగానికి కూడా బ్రేకులు లేకుండా పోయాయి. మలుపుల ప్రదేశాల వద్ద కూడా మితిమీరిన వేగంతో ఒకరిని మరొకరు సైడ్ వేసుకునే క్రమంలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సమస్య ఇప్పటిది కాదు.. ఏండ్ల నుంచి ఉన్నది. మండల కేంద్రంలోనుంచి ఇతర ప్రాంతాలకు వెళ్ళే రహదారిలో కురగాయల సంత మార్కెట్ ప్రదేశం వద్ద కూడా ఇదే పరిస్థితి ఉన్నది. ఈ రహదారి అనేక చిన్న గ్రామాలకు అనుసంధానంగా ఉంటుంది. రహదారి పరిమాణం కూడా తక్కువగానే ఉంటుంది. ఇటువంటి రహదారిపై కూడా క్వారీ లారీలు, మిగిలిన వాహనాల వేగం.. రోడ్డు పక్కల నివాసం ఉండే వారికి కంటిపై కునుకు లేకుండా చేస్తున్నది. పిల్లలు బయటకు వస్తే చాలు వారివెంట తప్పనిసరి ఎవరోఒకరు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రమాదకర మలుపులు కూడా ఈ రహదారిలో ఎన్నో ఉన్నాయి. అయినా వాహనాల వేగం మాత్రం తగ్గడం లేదు. ఇదే ప్రాంతంలో పోలీస్‌స్టేషన్ కూడా ఉంది. కాబట్టి అతివేగంగా వచ్చే వాహనాలపై పోలీసులు దృష్టి సారించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. స్పీడ్ బ్రేకర్స్, హెచ్చరిక బోర్డులు అమర్చాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

గ్రామీణ రోడ్లు మరీ అధ్వానం..

మండలంలో గ్రామీణ రోడ్లన్నీ అద్వానంగా ఉన్న, పాలకులు గాని, అధికార యంత్రాంగం గాని పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఎన్నికల సమయంలో నాయకులు ఓట్ల కోసం వచ్చి.. రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీలు గుప్పించినా.. ఎన్నికల అనంతరం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. దాంతో గ్రామీణ రోడ్లన్నీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ప్రతి ఏటా వర్షా కాలంలో పొట్టిపల్లి, ఎల్గోయి,సిద్దాపూర్,వనంపల్లి, ప్యారవ రం, మేదపల్లి, ఈదులపల్లి ఆయా తండల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో పనులు కొనసాగుతున్నప్పటికీ అవి మధ్యంతరంగానే నిలిచిపోయాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ రోడ్లపై ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్లమెంట్ సభ్యులు ప్రయాణాలు కొనసాగించినా.. ప్రస్తుతం ఈ రోడ్లకు మోక్షం కలగడం లేదు.

ప్రజా ఆశీర్వాదంతోనే అభివృద్ధి

- పటాన్‌చెరు ఎమ్మెల్యే జీఎంఆర్
- జిన్నారం మండలంలో రూ.2.35 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం



నవతెలంగాణ-జిన్నారం

ప్రజాశీర్వాదం, సహకారంతోనే విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్టు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ప్రజాప్రతినిధుల సమిష్టి ప్రణాళికలతో ప్రజావసరాలు తీర్చడమే ధ్యేయంగా రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారం, అండూరు, సోలక్పల్లి, ఊట్ల,జిన్నారం, మాదారం, గ్రామాల్లో రూ.2 కోట్ల 35 లక్షల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయ కత్వంలో దశాబ్దికాలంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధికి దిక్సూచి గా తీర్చిదిద్దామన్నారు. ప్రభుత్వం నిధులు, సీఎస్ ఆర్ నిధులతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్టు చెప్పారు. పటాన్చెరు నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజా సంక్షేమం, శ్రేయస్సు, అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అంతకుముందు బీఆర్ఎస్ నాయకులు, పార్టీ శ్రేణులు, స్థానికులు ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ కుంచాల ప్రభాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత వెంకటేష్ గౌడ్, జిన్నారం ఎంపీపీ ఉపాధ్యక్షులు గంగు రమేష్, సర్పంచులు ప్రకాశంచారి సరితా సురేందర్ గౌడ్, అంతిరెడ్డిగారి లావణ్య శ్రీనివాస్‌రెడ్డి, సోలక్ పల్లి శ్రీకాంత్‌రెడ్డి, ఆంజనేయులు ఖదీర్, రేఖా కృష్ణ, ఎంపీ టీసీలు జానాబాయ్, స్వాతి ప్రభాకర్‌రెడ్డి, సంతోష్ మహేష్, గడ్డపో తారం ఉపసర్పంచ్ మమత పెంటేష్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీల సంక్షేమానికి పెద్దపీట



నవతెలంగాణ-రామచంద్రాపురం

పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని పద్మశాలి కులస్తుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, సంక్షేమ పథకాల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో వారికి సముచిత స్థానం కల్పిస్తున్నామని స్థానిక శాసనసభ్యులు మహిపాల్ రెడ్డి అన్నారు. భారతినగర్ డివిజన్ పరిధిలోని బీహెచ్ఈఎల్ పెద్దమ్మ గుడి సమీపంలో గల భేల్ అధికార కార్మిక సంఘం కార్యాలయ ప్రాంగణంలో భేల్ పద్మశాలి సంక్షేమ సంఘం శాఖ 50 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన స్వర్ణోత్సవ సమ్మేళనం కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత రంగానికి పెద్ద పీట వేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. నియోజకవర్గంలోని పద్మశాలీల కులస్తుల అభివృద్ధికి కృషి చేశామన్నారు. పటాన్చెరు నియోజకవర్గం నుండి మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించడంలో పద్మశాలి కులస్తుల సహకారం మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక సభ్యులకు పద్మశాలి ప్రముఖులకు అతిథులకు సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు, వివాహ పరిచయ వేదిక వంటి కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ విభాగాల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్ప నగేష్, రాగం నాగేందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అశోక్, మల్లేష్, సంఘం అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి నారాయణ, సోమదాసు, చిరంజీవులు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

లెనిన్ 100వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళ్లు



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

రష్యన్ విప్లవ పోరాటయోధుడు కామ్రేడ్ లెనిన్ 100వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం నారాయణ ఖేడ్ పట్టణంలోని స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయంలో లెనిన్ ఫోటోకు పూలమాల వేసి విప్లవ జోహార్లతో ఘనంగా నివాళర్పించారు. ఈ సందర్భంగా పార్టీ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్ మాట్లాడుతూ.. రష్యన్ విప్లవం తీసుకురావడంలో మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ చాలా కీలకపాత్ర వహించినట్టు చెప్పారు. మార్క్స్, ఎంగిల్స్ సమాజ సూత్రాలకనుగునంగా కార్మిక, కర్షక మైత్రిని పెంపొందించడం ద్వారా.. లెనిన్ ఆనాడు రష్యాలో జార్జ్ చక్రవర్తికి వ్యతిరేకంగా పోరాటం చేసి విప్లవాన్ని సాధించడమే కాకుండా.. అనేక దేశాలకు ఈ విప్లవం మార్గదర్శకంగా ఉంద న్నారు. రాజ్యం, సూత్రాలు ప్రపంచంలో అనేక దేశాలకు నేడు కమ్యూనిస్టు దేశాల సూత్రాలు ఆదర్శంగా నిలబడ్డాయన్నారు. నేడు భారత దేశంలో ఉన్న పరిస్థితులకు లెనిన్ సూత్రాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. వాటిని ప్రస్తుతం అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. లెనిన్ ఆరోజు కమ్యూనిస్టు గ్రూపులన్నీ ఐక్యం కావాలి, కార్మిక వర్గం ఉధృతమైన పోరాటాలు నిర్వహించాలి, బలమైన కమ్యూనిస్టు పార్టీలను నిర్మించాలని చెప్పినట్టు గుర్తు చేశారు. కార్మిక, కర్షక మైత్రిని పెంపొందించడం కోసం భారతదేశంలో సంయుక్తా కిసాన్ మోర్చా ఏర్పడి, కార్మిక సంఘాలన్నీ కలుపుకొని ఇప్పటికే పోరాటాలు చేస్తున్నాయన్నారు. దానికి అనుగుణంగానే వచ్చేనెల ఫిబ్రవరి 16 తేదీ నాడు 'దేశవ్యాప్తంగా సమ్మె - గ్రామీణ బంద్'ను పారిశ్రామిక, ఉద్యోగులు కూడా ఒకరోజు సమ్మె కార్యక్రమాన్ని తీసుకోబోతున్నారన్నారు. లెనిన్ ఆశయాలను ముందుకు తీసుకు పోవడానికి సీపీఐ(ఎం) కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నారాయణ ఖేడ్ ఏరియా కమిటీ సభ్యులు కొతారి నర్సింలు, నాయకులు చిరంజీవి సంగయ్య శ్రీనివాస్ రమేష్ గౌతం ప్రజా సంఘాల నాయకులు తుకారాం దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలి

- తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు బీరయ్య యాదవ్



నవతెలంగాణ-సంగారెడ్డి

మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు బీరయ్య యాదవ్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. దాదాపు 24 ఏండ్లుగా తాను తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం ఉమ్మడి మెదక్ జిల్లా అంతటా అవిశ్రాంతంగా పనిచేశానన్నారు. అనేక ఏండ్లుగా ఆర్థికంగా కూడా ఎంతో ఖర్చు చేశానన్నారు. అనేక సార్లు పోలీస్ కేసులు, లాఠీ దెబ్బలు తిని, చివరకు జైలు కూడా వెళ్లానని గుర్తు చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉండి.. ఇంత చేసినప్పటికీ నాటి నుండి నేటి వరకు తనకు పార్టీ నుంచి పదవులు గానీ లభించలేదన్నారు. అంతేకాకుండా ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు కూడా పొందలేదన్నారు. కాబట్టి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ స్థానం నుంచి తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలని జనవరి 19న జరిగిన మెదక్ పార్లమెంటరీ సమావేశంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులను కోరినట్టు చెప్పారు. మెదక్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలతో విస్తృతమైన సంబంధాలు తనకు ఉన్నాయన్నారు. కేసీఆర్ ఆశీస్సులతో గతంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శిగా, వివిధ ఎన్నికల్లో పలు జిల్లాల, మండల ఇంచార్జ్‌గా పని చేశానన్నారు. జిల్లాలో తనకు తెలంగాణ ఉద్యమకారుడిగా, బీసీ నేతగా ప్రజల్లో మంచి గుర్తింపు ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గొల్ల కుర్మల జనాభా సంఖ్య దాదాపు 50 లక్షల వరకు ఉందని, ఈ వర్గాల ప్రతినిధిగా తనకు అవకాశం కల్పించాలని పార్టీ అధిష్టానాన్ని, అదేవిధంగా జిల్లాలోని ఎమ్మెల్యేలను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ నాయకుడు ఉస్మాన్ అలీ, విద్యార్థి నాయకుడు అఖిల్, యువజన నాయకుడు నరేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దావోస్ పెట్టుబడులతో యువతకు ఉపాధి



నవతెలంగాణ-పటాన్‌చెరు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన వల్ల తెలంగాణకు వస్తున్న రూ.40 వేల కోట్ల పెట్టుబడులతో వేలాది మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు దొరుకుతాయని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, ఐఎన్‌టీయూటీసీ జిల్లా అధ్యక్షులు కొల్కూరి నర్సింహ రెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. గడిచిన 5 ఏండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ.19 వేల కోట్ల పెట్టుబడులు తెస్తే.. కేవలం 2 నెలల పరిధిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.40 వేల కోట్ల పెట్టుబడులు తీసుకురాగ లిగిందన్నారు. ఉమ్మడి మెదక జిల్లాకు తాగు, సాగు నీరు, పరిశ్రమలు తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. సోనియా గాంధీ లేదా ప్రియాంక గాంధీ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ నుంచి పోటీ చేస్తే భారీ మెజా ర్టీతో గెలవడం ఖాయమన్నారు. మెదక్ పార్లమెంట్ నుండి రెండుసార్లు గెలిచిన బీఆర్ఎస్.. గత 5 ఏండ్లలో కేంద్రం నుంచి తెచ్చిన నిధులు ఎంతో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవ రెడ్డి, యువరాజ్ మోరే, నాయకులు పాషా కుంచల కిషన్, హమీద్ వడ్డే శేకర్ రతన్ సింగ్, మల్లేష్, అంజయ్య, రాజు సతీష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వకుంటే విధులు బహిష్కరిస్తాం



నవతెలంగాణ-సంగారెడ్డి

మున్సిపల్ కార్మికులకు వేతనాలు ఇవ్వకుంటే విధులు బహిష్కరిస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల సమావేశాన్ని స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వకుండా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్మికులు వేతనాలు అడిగితే ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని మండిప డ్డారు. కార్మికులపై దురుసుగా ప్రవర్తిస్తున్న మున్సిపల్ అధికా రులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రెండు నెలల నుంచి వేతనాలు ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్మికులకు వేత నాలు ఇవ్వకుంటే విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా మున్సిపల్‌లో కార్మికుల సమస్యలు ఎక్కడ ఏసినా గొంగడి అక్కడే అన్నట్టుగా ఉన్నాయన్నారు. మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, 11వ పిఆర్సీ చైర్మెన్ సిఫారసు చేసిన వేతనాలు రూ.19000, రూ.22900, రూ.31040 లను కనీస వేతనాలుగా నిర్ణ యించి ఇవ్వాలన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ.25 లక్షల ఇన్సురెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయ కులు సువర్ణ, మల్లేశం, లక్ష్మీ, శ్రీనివాస్, నర్సింలు, లక్ష్మణ్, యాద య్య, ముస్తఫా, శ్రీనివాస్, రాజు, వినోదు, మల్లేష్, మంజుల, రవి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

టీఎస్‌యూటీఎఫ్ కంగ్టి ఆధ్వర్యంలో మండల ఉపాధ్యాయులకు ఆదివారం టీచర్స్ స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేశారు. అందులో భాగంగా జరిగిన క్రికెట్ పోటీల్లో తడ్కల్ కాంప్లెక్స్ టీం విన్నర్‌గా, కంగ్టి కాంప్లెక్స్ టీం రన్నర్‌గా నిలిచింది. అనిల్ ఉత్తమ ప్రతిభ కనబర్చి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ గెల్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు కాశీనాథ్ జాదవ్ హాజరై మాట్లాడారు. క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు.. మానసిక ఉల్లాసానికి దోహద పడుతాయన్నారు. అలాగే ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏసుదాస్, మండలాధ్యక్షులు అంజయ్య, ఉపాధ్యక్షులు జైపాల్, నవతెలంగాణ రిపోర్టర్ అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనగర్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తా



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

లక్ష్మీనగర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో ఆయన పర్యటిం చారు. కాలనీలో విద్యుత్ సమస్య ఉందని, రాత్రి సమయంలో వెలుతురు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు కాలనీ వాసులు ఆయనకు విన్నవించారు. ఈ మేరకు ఆయన స్పందిస్తూ.. విద్యుత్ అధికారులతో మాట్లాడి.. అవసరమైన చోట విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కౌన్సిలర్ చంద్రారెడ్డి చొరవకు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి, సతీష్, సురేష్, దుర్యోధన, సాయి, కన్నా, విద్యుత్ అధికారులు, లక్ష్మీనగర్ కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

దర్గా వద్ద ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు



నవతెలంగాణ-నర్సాపూర్

మండల పరిధిలోని నారాయణపూర్ హజ్రత్ సయ్యద్ లాల్ షక్వ ద్రి ఉర్ఫ్ మౌలానా బాబా దర్గా వద్ద ఆదివారం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి పాల్గొని పాత్యాల్ ఇచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామ సర్పంచ్ మహమ్మద్ ఇస్రాత్ ఫాతిమా అబూ భాయ్ ఆధ్వర్యంలో సర్పంచ్ ఇంటి వద్ద నుంచి ఎమ్మెల్యే సునీత రెడ్డి పూలు పండ్ల దట్టితో దర్గా వద్దకు చేరుకున్నారు దర్గా వద్ద ముస్లిం మత పెద్దల ఆచారం ప్రకారం ఎమ్మెల్యే సునీత రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ కులాలకతీతంగా ప్రతి ఒక్కరు దర్గాను దర్శించుకొని ప్రార్థనలు చేయాలని ఆమె కోరారు. ఇలాంటి దర్గాను గ్రామాలలో ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇస్రాత్ ఫాతిమా అబ్బు బాయ్‌లు ఎమ్మెల్యే సునీత రెడ్డిని, మాజీ ఎమ్మెల్యే మదర్ రెడ్డిలను శాలువాతో సన్మానించారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే సునీత రెడ్డి ఎమ్మెల్యేగా గెలిస్తే ఈ దర్గా వద్ద ఎమ్మెల్యే సునీత రెడ్డిచే ప్రార్థనలు చేయిస్తానని సర్పంచ్ ఇస్రాత్ ఫాతిమా అబ్బుబాయిలు మొక్కుకున్నారు. ఈ మేరకు సర్పంచ్ తన మొక్కును చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంచార్జ్ చైర్మన్ నాయీమ్ మొద్దిన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అశోక్ గౌడ్, నాయకులు పంబల్ల బిక్షపతి, మమ్మద్, భోగ చంద్రశేఖర్, బాబా భాయ్, ఆజం బాయ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్లన్న స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే సునితా రెడ్డి



నవతెలంగాణ-కౌడిపల్లి

రాయిలాపూర్ గ్రామ శివారులోని మల్లికార్జున స్వామి ఆలయ 16వ వార్షికోత్సవం సందర్భంగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం మల్లన్న స్వామికి అగ్నిగుండాలు, బోనాలు ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ స్వామివారి కృపతో ప్రజలంతా పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కోరారు. ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉంటేనే సుఖసంతోషాలు, మనశ్శాంతితో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, ఆలయ నిర్వాహకులు శామీర్‌పేట నర్సింగరావు, సర్పంచ్ ఎల్లం, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, వైస్ ఎంపీపీ నవీన్ గుప్తా, దొంతుల దుర్గయ్య, శివ, మల్లేష్ యాదవ్, రాజు, రవి సాగర్, తదితరులున్నారు.

నర్సాపూర్‌ను మరింత అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి



నవ తెలంగాణ-నర్సాపూర్

భగవంతుడి ఆశీస్సులతో నర్సాపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివద్ధి చేస్తామని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునితా లక్ష్మారెడ్డి అన్నారు. శివ్వంపేట మండలంలోని సికింద్లాపూర్ శివారులో వెలసిన శ్రీలక్ష్మీనర్సింహా స్వామి జాతర ఉత్సవాలను ఆదివారం ఆలయ ఈఓ శశిధర్, సర్పంచ్ ఏనుగు సుధాకర్ రెడ్డి, ఉపసర్పంచ్ రామారం నర్సిములు, ఆలయ ప్రధాన అర్చకులు ధనుంజయ శర్మతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, జాతర ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహా స్వామి జాతర మూడు నెలల పాటు బ్రహ్మాండంగా నిర్వహిస్తారన్నారు. ఆలయ అభివద్ధికి తనవంతు సహకారం తప్పకుండ అందిస్తానన్నారు. జాతర ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే సునీతారెడ్డికి ఆలయ ఈఓ శశిధర్ ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు.

రహదారి నిబంధనలపై గ్రామస్తులకు అవగాహన



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట

రహదారి నిబంధనలపై కె.వెంకటాపూర్ గ్రామస్తులకు అధికారులు అవగాహన కల్పించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్స వాల్లో భాగంగా పెద్దశంకరంపేట శివారులోని 161వ జాతీయ రహదారి కే వెంకటాపూర్ గ్రామంలో గ్రామస్తులకు పేట ఎస్సై బాలరాజ్, ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్ట్ ఐఎంఎస్ మేనేజర్ ఖాజా మైనోద్దీన్‌లు రహదారి నిబంధనల గురించి వివరించారు. వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు ఉండాలని వారు వివరించారు. వాహనాలు నడిపేటప్పుడు మద్యం సేవించరాదని ,సెల్ ఫోన్ కూడా వాడరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో కేవిఎస్ఆర్ ఎన్‌హెచ్ఏ సిబ్బంది కృష్ణయ్య, శివకుమార్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రావి ఆకుపై బాలరాముడి చిత్రపటం



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట

అయోధ్యలో జనవరి 22న బాల రాముని ప్రాణ ప్రతిష్ట సందర్భంగా పెద్ద శంకరంపేటకు చెందిన అవుసుల శ్రీనివాస చారి ఆదివారం రావి ఆకుపై బాల రాముని చిత్రాన్ని చిత్రించి తన భక్తిని చాటుకున్నాడు. భారతీయుల 500 సంవత్సరాల కల నెరవేరుతున్నందున ఎంతో సంతోషంగా ఉందని. ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకొని రావి ఆకుపై డ్రాయింగ్ పెయింటితో శ్రీరాముని చిత్రపటాన్ని అందంగా అలంకరించాడు. రాముని చేతిలో విల్లును ఏర్పాటు చేయడంతో పాటు కాషాయం రంగులో జైశ్రీరామ్ అని రాసి తన భక్తిని చాటుకున్నారు. పలువురు అతన్ని అభినందించారు.

సద్గురు శ్రీ కృష్ణా నందాజీ మహరాజ్‌కు ఘన స్వాగతం



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని చిప్పల్‌తుర్తి గ్రామం లో సద్గురు దామ ఆశ్రమానికి విచ్చేస్తున్న సందర్భంగా నర్సాపూర్ హైదరాబాద్ ప్రధాన రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సద్గురు శ్రీ కృష్ణానందాజీ మహారాజ్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సద్గురు కబీర్ సేన అధ్యక్షులు సంధ్యారాణి చత్రునాయకుల ఆధ్వర్యంలో శివాలయ పూజారి వీరప్ప గురుస్వామి, సంజీవ్, లక్ష్మణ్ గౌడ్, శ్రీనివాస్‌లతోపాటు శివ స్వాములు పూల దండలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నర్సాపూర్ నుంచి చిప్పల్‌తుర్తి ఆశ్రమం వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. జై కష్ణానందా, జై మహారాజ్, జై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆశ్రమం వరకు ఈ ర్యాలీ సాగింది. సద్గురు శ్రీ కష్ణ నందాజీ మహారాజ్ ఆశ్రమానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సద్గురు కబీర్ సేన అధ్యక్షులు సంధ్యారాణి చత్రునాయక్ ఆధ్వర్యంలో సద్గురు సేవా ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శిష్యులు భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సద్గురు కబీర్ సేన, సేద్విప్ర సమాజ సేవ సభ్యులు నాగేందర్ గంప, ఆచార్య మేధా, గుప్తాజీ, వాగ్యా నాయక్, రవీందర్, జి మహాత్మా రోహిత్, మహాత్మ కీర్తి, బాబూలాల్, సురేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పొట్టకూటి కోసం..
యూపీ కూలీల వలస బాట

- వరినాట్ల కోసం వలసవచ్చిన యూపీ, బీహార్ కూలీలు
- ప్రతీ సంవత్సరం రెండు నెలల పాటు వరినాట్లతో ఉపాధి
- ఎకరాకు రూ.4వేల నుంచి రూ.4,500లు చెల్లిస్తున్న రైతులు



నవతెలంగాణ- కొల్చారం

మండలంలో వరినాట్లు వేసేందుకు ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు చెందిన కూలీలు వలస వస్తున్నారు. ప్రతీ సంవత్సరం రెండు నెలల పాటు ఇక్కడే ఉండి వరి నాట్లు వేస్తారు. మగ కూలీలే వరినాట్లు త్వరగా వేస్తుండడంతో రైతులు కూడా వీరి సేవలను వినియోగించుకుంటున్నారు. కొల్చారం మండలంలోని మంజీరా పరివాహక గ్రామాలైన యెనగండ్ల, వైమాందాపూర్, కోనాపూర్, పైతర, తుక్కాపూర్, సంగాయిపేట, చిన్నఘణపూర్ తదితర గ్రామల రైతులు వరిపంటను అధికంగా సాగు చేస్తుంటారు. ఇక్కడి కూలీల కొరత కారణంగా కొందరు ఏజెంట్లుగా మారి ప్రతి ఏటా యూపీ, బీహార్ కూలీలను వలసగా తీసుకువచ్చి వరినాట్లు వేయిస్తారు. సీజన్‌లో డిమాండ్‌ను బట్టి ఎకరాకు రూ.4వేల నుంచి రూ.4,500 వరకు తీసుకుంటున్నారు. మండలంలో వానాకాలం, యాసంగి సీజన్‌లలో అత్యధికంగా వరి పంటను సాగు చేస్తారు. ఈ సంవత్సరం కూడా వానాకాలం ప్రారంభంలోనే మంజీరా పరివాహక గ్రామాల పరిధిలో వరినాట్లు మొదలయ్యాయి. సాంప్రదాయానికి భిన్నంగా మొత్తం మగ కూలీలే వరినాట్లు వేస్తారు. 17 మంది ఒక జట్టుగా ఏర్పడి రోజుకు 6 నుంచి 7 ఎకరాల వరకు వరి నాట్లు వేస్తున్నారు. గంటకు ఎకరం చొప్పున వీరు వరి నాట్లు వేస్తుండడంతో రైతులు కూడా వీరికే మొగ్గు చూపుతున్నారు. వీరు ఉదయం 6 గంటలకే పొలానికొచ్చి సాయంత్రం 6గంటల వరకు నాట్లు వేస్తారు. గ్రామాల్లో కూలీలు అందుబాటులో లేక, మహిళలు ఉదయం 10 నుంచి 5 గంటల మధ్య పనిచేస్తుండడంతో మగ కూలీల వైపే రైతులు మొగ్గు చూపుతున్నారు.

17 నుంచి 20 మంది ఒక జట్టుగా

ఉత్తర ప్రదేశ్, బీహార్ నుంచి వీరు జట్లుగా వస్తున్నారు. 17 నుంచి 20 మంది వచ్చి ఒకే దగ్గర ఉంటారు. వంట కలిసే చేసుకుంటారు. ఏజెంట్లు ఏ గ్రామానికి పంపిస్తే ఆ గ్రామానికి వెళ్తారు. ఆ గ్రామంలో వరినాట్లు పూర్తికాగానే పక్క గ్రామాలకు వెళ్తారు. పూర్తిస్థాయిలో పనులు అయిన తర్వాతనే తిరిగి తమ రాష్ట్రాలకు వెళ్తారు. వీరికి రెండు నెలల పాటు ప్రతీరోజు పని ఉంటుంది. తమ రాష్ట్రాలలో తగినంతగా పనిలేకపోవడం వల్లనే ఇక్కడికి వస్తున్నామని తెలిపారు. కుటుంబాలను సొంత గ్రామాలలో ఉంచి వస్తున్నామని వారు తెలిపారు. తమకు అన్ని ఖర్చులు పోను నెలకు రూ.20వేల నుంచి రూ.30వేల మధ్య మిగులుతాయని తెలిపారు. వానాకాలంతో పాటు యాసంగి సీజన్‌లో కూడా వచ్చి వెళ్తామని తెలిపారు.

మా రాష్ట్రంలో పనిలేకనే ఇక్కడికి వచ్చాం

అశోక్, కూలీ యూపీ



మా గ్రామంతో పాటు రాష్ట్రంలో పని దొరకడంలేదు. ఇక్కడికి వస్తే 2 నెలల పాటు పని దొరుకుతుంది. రైతులు కూడా సహకరిస్తున్నారు. గడిచిన నాలుగేళ్లుగా ఇక్కడికి వచ్చి వరి నాట్లు వేసి వేళ్తున్నాం.

17 మంది జట్టుగా వచ్చాం..

తపన్, కూలీ యూపీ



వర్ని మండలానికి 25 మందిమి జట్టుగా వచ్చాం. నిత్యం 6 నుంచి 7 ఎకరాలలో వరినాట్లు వేస్తున్నాం. సీజన్ ముగిసే వరకు ఉంటాం. చుట్టుపక్కల గ్రామాలకు కూడా వెళ్లి నాట్లు వేస్తాం.

ఓటరు సవరణలో నిబంధనలు పాటించాలి

- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-మెదక్

నూతన ఓటరు జాబితా సవరణలో నిబంధనలు పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా సూచించారు. ఆదివారం మెదక్ మండలం మక్తభూపతిపూర్‌లోని 123, 124 పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలలో ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదును బిఎల్‌ఓలు ఓటరు జాబితాను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. ఫోటో ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా నూతన ఓటరు నమోదు, ఓటర్లు జాబితాలో సవరణలు, మార్పులు, తొలగింపులను భారత ఎన్నికల సంఘం నిబంధనలను పాటించాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో చనిపోయిన ఓటర్లు, 100కు పైగా వయసున్న ఓటర్లు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లు, చిరునామా మారిన ఓటర్లపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఓటరు జాబితాలో ఉన్న అన్ని పేర్లను పరిశీలించాలన్నారు. ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, తొలగింపులపై దృష్టి సారించాలన్నారు. బిఎల్‌ఓలకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయని, ఎన్ని పరిష్కరించారని అడిగి తెలుసుకున్నారు. బిఎల్‌ఓలు తమ పరిధిలోని అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కును పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ అంబాదాస్ రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్ బిఎల్‌ఓ, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



నవ తెలంగాణ-నర్సాపూర్

క్రీడల్లో గెలుపోటములు సహజమేనని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. నర్సాపూర్ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సుల్తాన్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఆదివారం క్రికెట్ టోర్నమెంట్‌లో ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ క్రికెట్ టోర్నమెంట్ మ్యాచ్‌లో విజేతగా సుబ్బు జిఎస్ఎమ్ టీమ్ నిలువగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణంలో యువకులకు ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమేనని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంచార్జ్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుల అశోక్ గౌడ్, నాయకులు పంబల్ల బిక్షపతి, సత్యం గౌడ్, భోగ చంద్రశేఖర్, బాల్ రెడ్డి, జ్ఞానేశ్వర్, షేక్ హుస్సేన్, మహమ్మద్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎల్ఈడీ లైట్స్‌ను ప్రారంభించిన సర్పంచ్



నవ తెలంగాణ టేక్మాల్

టేక్మాల్ మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ మండల రెవెన్యూ కార్యాలయం ముందు శ్రీ బసవేశ్వర విగ్రహం వద్ద నూతన ఎల్ఈడీ లైట్లను సర్పంచ్ నాయికోటి సుప్రజ భాస్కర్ ప్రారంభించారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్ సహకారంతో నూతన ఎల్ఈడి లైట్స్‌ను ఏర్పాటు చేసి ఆదివారం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్పతో కలిసి ఆదివారం సర్పంచ్ ఎల్ఈడీ లైట్లను ప్రారంభించారు. ఈ లైట్లను ఏర్పాటు చేయడానికి కృషి చేసిన ఎంపీ బీబీ పాటిల్‌కు గ్రామస్తుల పక్షాన సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భక్తుల వరలక్ష్మి, మాజీ ఎంపిటిసి సిద్దయ్య, చింత రవి, ఎం ఎ సలీం, గోవింద్ చారి, సలావుద్దీన్, వీరేశం, సుధాకర్, వీరేందర్, తదితరులు పాల్గొన్నారు.

లేగ దూడపై అడవి జంతువు దాడి



నవతెలంగాణ-కౌడిపల్లి

లేగ దూడపై అడవి జంతువు (హైనా) దాడి చేసి చంపేసిన సంఘటన కౌడిపల్లి మండలం సలాబత్‌పూర్ గ్రామ శివారులోని పంట పొలాల్లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చాకలి శ్రీశైలం వ్యవసాయ పొలం వద్ద రోజు మాదిరిగానే తన పశువులను గ్రామ శివారులోని సదరోన కుంట వద్ద కట్టేశాడు. ఆదివారం ఉదయం పశువుల వద్దకు వెళ్లి చూడగా లేగదుడ కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతకగా లేగ దూడ కొద్ది దూరంలో ఏదో జంతువు ఎత్తుకెళ్లి చెట్ల చాటున తినేసి చనిపోయి కనిపించింది. దీంతో అటవీ శాఖ శిక్షణ అధికారి కలీముల్లాకు రైతు ఫిర్యాదు చేశాడు. అటవీశాఖ, పశువైద్యాధికారి సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. అధికారులు పరిశీలించి అడవి జంతువు హైనా తిని పడేసిందని రైతులకు చెప్పారు. హైనా కూడా చిరుత పులి మాదిరిగానే వెంటాడి అడవి జంతువులను, పశువులను తింటుందని తెలిపారు. చిరుత పులి అని ఎవరు కూడా అధైర్య పడద్దని రైతులకు సూచించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, అడవి ప్రాంతానికి వెళ్లే గొర్రెలు, మేకల కాపర్లు చిరుతపులి సంచరిస్తున్నదన్న భయాందోళనకు గురయ్యారు. ఇలాంటి జంతువులు సలాబత్‌పూర్ అటవీ ప్రాంతంలో లేవని, ఎక్కడి నుంచో వచ్చి లేగదూడను తిని చంపిందని , గ్రామస్తులు భయాందోళన చెందవద్దని అటవీశాఖ అధికారులు తెలిపారు.

బోరు మోటారు ప్రారంభించిన ఎమ్మెల్యే



నవ తెలంగాణ-నర్సాపూర్

శివ్వంపేట జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త తన స్వంత డబ్బులతో వేయిస్తున్న బోర్ మోటార్‌ను ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి ఆదివారం ప్రారంభించారు. మంచినీటి బోరు మోటారును జడ్పీటీసీ మహేష్ గుప్త, సర్పంచ్ ఏనుగు సుధాకర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు పిట్ల సత్యానారాయణ, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు లావణ్య మాధవరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వాకిటి హనుమంతరెడ్డి, సర్పంచులు గొల్ల చంద్రకళ శ్రీశైలం, బిడికోలు మాధవరెడ్డి, నాయకులు మర్రి మహేందర్ రెడ్డి, సునీతా బిక్షపతి రెడ్డి, మామిడి నర్సారెడ్డి, కుమార్ గౌడ్, వెంకటేష్ గౌడ్, కుంట లక్ష్మణ్, ఆలయ సిబ్బంది నర్సింహా రెడ్డి, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆసుపత్రి ఖర్చులకు జెడ్పీటీసీ ఆర్థిక సహాయం




నవతెలంగాణ-నర్సాపూర్

శివ్వంపేట మండలంలోని గంగాయిపల్లి గ్రామానికి చెందిన తలారి బాబు కూతురు తలారి క్షేత్ర కు గుండెలో రంధ్రం ఏర్పడడంతో గుండె ఆపరేషన్ చేయించారు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త తన స్వంత డబ్బులు రూ. 10 వేలను క్షేత్ర ఆసుపత్రి, మందుల ఖర్చులకుగాను అందజేశారు. ఆదివారం గ్రామ సీనియర్ నాయకులు, బీఆర్ఎస్ యువత మండల అధ్యక్షులు తాటి పవన్ గుప్త చేతులమీదుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పవన్ గుప్త మాట్లాడుతూ ఆపదలో ఉండే ప్రతి బాధిత కుటుంబానికి ఆపద్భంధావుడిలా మీకు నేనున్నానని ఆర్థికంగా అండగా నిలుస్తున్న జడ్పీటీసీ మహేష్ గుప్త సేవలు ఎంతో గొప్పవన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మన్నే సదానందం, ఎండీ హుస్సేన్, తలారి సంగమేశ్వర్, తలారి యాదగిరి, వడ్ల పద్మాచారి, తదితరులు పాల్గొన్నారు.

మగ్దుంపూర్‌లో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మండలంలోని మగ్దుంపూర్ గ్రామంలో ఇటీవలే మరణించిన ఎండీ ఇస్మాయిల్ కుటుంబానికి జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త తన స్వంత డబ్బులు రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని సర్పంచ్ సోము అశోక్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సోము అశోక్ మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందిస్తున్న జెడ్పీటీసీ మహేష్ గుప్తకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండీ అర్చత్, తదితరులు పాల్గొన్నారు.

రాముడి చిత్రం గీసిన అక్షయ్



నవతెలంగాణ-పాపన్నపేట

అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ట సందర్భంగా ఓ బాలుడు అయోధ్య రాముడు సీతను తీసుకొని అయోధ్య రామ మందిరంలోకి ప్రవేశిస్తున్న చిత్రాన్ని కండ్లకు కట్టినట్లు అద్భుతంగా గీసి అందరిని ఆకట్టుకున్నాడు. దేశవ్యాప్తంగా సోమవారం రామ మందిరం ప్రారంభం సందర్భంగా ఊరూరా ర్యాలీలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రమైన పాపన్నపేటకు చెందిన ఆకుల భాస్కర్ తనయుడు ఏడవ తరగతి విద్యార్థి ఆకుల అక్షయ్ రాముడు సీతను తీసుకొని అయోధ్య రామ మందిరంలోకి అడుగుపెడుతున్న చిత్రాలను కేవలం 10 నిమిషాల్లో డ్రాయింగ్ వేసి అందరి మన్ననలు పొందాడు. ఇంత అద్భుతంగా 10 నిమిషాల్లో గీసిన అక్షయ్‌ను అందరూ అభినందించి శభాష్ అక్షయ్ అంటూ ఆశీస్సులు అందించారు.

ప్రభుత్వ సలహాదారుడిని కలిసిన కాంగ్రెస్ నేత



నవ తెలంగాణ- గజ్వేల్

తెలంగాణ ప్రభుత్వ సలహాదారునిగా నియమితులైన హరికర వేణుగోపాల్ రావును గజ్వేల్ కాంగ్రెస్ నాయకులు అస్గర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ లో విజయం సాధించాలని వేణుగోపాలరావు పిలుపునిచ్చినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తుంది ఆయన అన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన చెక్కలి రమేష్(45) గ్రామ పంచాయతీలో వాటర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల మృతి చెందాడు. ఆదివారం మర్కుక్ ఎంపీపీ పాండు గౌడ్, జెడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి మృతుని కుటుంబాని పరామర్శించి రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. బోయిని మల్లేష్, ఉప్పరి యాదగిరి, మేకల శ్రీనివాస్, మల్లేష్, బాలస్వామి తదితరులున్నారు.

చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటయ్యేనా?

- అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామని మాజీ సీఎం కేసీఆర్, సీఎం రేవంత్‌రెడ్డి హామీ
- హామీని అమలు చేయాలని కోరుతున్న చేర్యాల ప్రజలు







నవతెలంగాణ-చేర్యాల

చారిత్రకంగా, రాజకీయంగా అన్ని అర్హతలున్న చేర్యాల ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని స్థానికులు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూలిమిట్ట మండలాలతో కలిపి చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని గత ఐదు సంవత్సరాలుగా చేర్యాల ప్రాంత ప్రజలు జేఏసీగా ఏర్పడి ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. చేర్యాల ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పలుమార్లు వినతి పత్రాలు అందజేశారు. 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తనను రెండోసారి గెలిపిస్తే చేర్యాల ప్రాంతాన్ని రెవెన్యూ డివిజనుగా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రెండోసారి గెలిచాక రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో జేఏసీ ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీలు, ప్రజలు అనేక ఉద్యమాలు, రాస్తారోకోలు చేయడంతో పాటు నెల రోజుల పాటు నిరవధిక దీక్షలు చేశారు. 2023 ఎన్నికల్లో సీఎం కేసీఆర్ సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డికి కాకుండా పల్లా రాజేశ్వర్‌రెడ్డికి టికెట్ కేటాయించారు. మొదటిసారి పల్లా రాజేశ్వర్ రెడ్డి చేర్యాలలో అడుగుపెట్టడంతో జేఏసీ నాయకులు పల్లా గోబ్యాక్ నినాదాలతో అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఎన్నికల ప్రచారంలో భాగంగా చేర్యాలలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో మాజీ సీఎం కేసిఆర్ పల్లా రాజేశ్వర్ రెడ్డిని గెలిపిస్తే గెలిచిన నెల రోజుల్లో చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనికితోడు కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో భాగంగా జనగామలో నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి సైతం ప్రతాప్‌రెడ్డి గెలిచిన నెల రోజుల్లో చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తామని ప్రకటించారు. జనగామలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటవుతుందో లేదో అనే సందిగ్ధత ప్రజల్లో నెలకొంది. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి చేర్యాలను రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జనగామలో కలపొద్దు



చేర్యాల ప్రాంతాన్ని సిద్దిపేట జిల్లాలోనే కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేర్యాలను రెవెన్యూ డివిజనుగా ఏర్పాటు చేయాలి. జిల్లాల కుదింపు పేరుతో చేర్యాల ప్రాంతాన్ని రాష్ట్ర ప్రభుత్వం జనగామ జిల్లాలో కలపొద్దు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జనగామ సభలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేర్యాలను రెవెన్యూ డివిజనుగా ప్రకటించాలి.

– ఆముదాల మల్లారెడ్డి, సీపీఐ(ఎం)సిద్దిపేట జిల్లా కార్యదర్శి

ప్రభుత్వం స్పందించాలి



చేర్యాల ప్రాంత ప్రజల చిరకాల కోరికైన రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తే 2026 నియోజకవర్గాల పునరుద్ధరణలో చేర్యాల ప్రాంతం తిరిగి నియోజకవర్గంగా ఏర్పడే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చేర్యాలను రెవెన్యూ డివిజనుగా ఏర్పాటు చేయాలి.

– పాశికంటి వెంకటరమణ, ఉపాధ్యాయురాలు, చేర్యాల

నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు



చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం ఆరు సంవత్సరాలుగా అనేక ఉద్యమాలు చేసినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎలాంటి ఉద్యమాలు చేయని ప్రాంతాలను రెవెన్యూ డివిజన్లుగా ఏర్పాటు చేసింది. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు చేర్యాల ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయించి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన చిత్తశుద్ధిని చాటుకోవాలి.

– బుట్టి సత్యనారాయణ, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి, చేర్యాల

రెవెన్యూ డివిజన్ చేయాలి



అన్ని అర్హతలు కలిగిన చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి. గత 2016 నుంచి ఉద్యమాలు చేస్తున్నా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ చేర్యాల రెవెన్యూ డివిజన్ ఉద్యమంలో పాల్గొంది. చేర్యాల రెవెన్యూ డివిజన్ ఆవశ్యకత కాంగ్రెస్ నాయకులకు తెలుసు. ఈ ప్రాంతంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించేలా ఒత్తిడి తేవాలి.

– తాడెం ప్రశాంత్,
రెవెన్యూ డివిజన్ సాధన సమితి పట్టణ కన్వీనర్

సమ్మక్క సారాలమ్మ జాతర నిర్వహణ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని దేవక్కపల్లి గ్రామంలో ఈ ఏడాది నిర్వహించనున్న సమ్మక్క సారాలమ్మ జాతర నిర్వహణ నూతన కమిటీ సభ్యుల ఎన్నిక ఆదివారం ఆలయ ప్రాంగణం వద్ద నిర్వహించారు. కమిటీ చైర్మన్‌గా జంగిడి సంజీవ రెడ్డి, వైస్ చైర్మన్‌గా రావుల రాజిరెడ్డి, కార్య నిర్వహణ అధ్యక్షుడిగా రావుల రంగారెడ్డి, కోశాధికారిగా అటికం సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా జనాగం రాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు చైర్మన్ సంజీవ రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 21న సమ్మక్క సారాలమ్మ జాతర ప్రారంభమై 22,23న భక్తులు తమ మొక్కులు చెల్లించుకుంటారని సంజీవ రెడ్డి తెలిపారు.

ఘనంగా శ్రీరామ శోభాయాత్ర



నవ తెలంగాణ - సిద్దిపేట

అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ సందర్భంగా ధర్మ కార్య ఉత్సవ సమితి, వివిధ సంఘాల ఆధ్వర్యంలో శ్రీరామ శోభాయాత్రను ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు రాముడు, హనుమంతుని వేషధారణలు ధరించి అలరించారు. మహిళలు కోలాటలు, బతుకమ్మ ఆటలు ఆడుతూ శ్రీరాముని పాటలు పాడుతూ శోభయాత్రలో పాల్గొన్నారు. పురుషులు రథంను లాగుతూ, నత్యాలు చేస్తూ యాత్రలో పాల్గొన్నారు. భక్తులు రథయాత్ర పై పూల వర్షానికి కురిపించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గజ్వేల్‌లో భారీ బైక్ ర్యాలీ



నవ తెలంగాణ- గజ్వేల్

అయోధ్యలో భవ్య మందిరం ప్రారంభం నేపథ్యంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో హిందువుల బైక్ ర్యాలీ జై శ్రీరామ అంటూ నినాదాలు మిన్నంటాయి. గజ్వేల్ పట్టణంలో ఉన్న అంగడి బజార్ హనుమాన్ దేవాలయం నుంచి ప్రజ్ఞాపూర్ వరకు ర్యాలీ నిర్వహించారు. వందల మంది యువకులు కాషాయ జెండా పట్టుకొని బైక్ పై ర్యాలీ నిర్వహించి నినాదాలను హోరెత్తించారు. సోమవారం అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులు చెప్పారు. అదేవిధంగా ప్రతి ఇంటిలో దీపావళి పండుగ వాతావరణం కనిపించాలని పిలుపునిచ్చారు.

వీటీజీ సెట్ దరఖాస్తు గడువు పెంపు



నవ తెలంగాణ - సిద్దిపేట

తెలంగాణలోని అన్ని గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువు పెంచినట్టు టీఎస్ డబ్ల్యూ ఆర్ఐఎస్ మెదక్ ఈస్ట్ రీజియన్ ప్రాంతీయ సమన్వయకర్త అధికారిని కె.నిర్మల తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 23లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 11న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో నాలుగవ తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జోరుగా సాగిన కొమురవెల్లి మల్లన్న జాతర















- భక్తులతో రద్దీగా మారిన కొమురవెల్లి క్షేత్రం
- పట్నంవారానికి భారీగా వచ్చిన హైదరాబాద్ వాసులు
- స్వామివారి దర్శనానికి 6 గంటల సమయం
- పట్నాలు వేసి.. బోనాలు చేసి మొక్కులు చెల్లించిన భక్తులు

నవ తెలంగాణ కొమురవెల్లి

కొమురవెల్లి మల్లన్న జాతర ఆదివారం జోరుగా సాగింది. మల్లన్న నామస్మరణతో ఆలయం మార్మోగింది. శివసత్తుల పూనకాలు, పోతురాజుల చిందులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులు గంగిరేణి చెట్టుకు ముడుపులు కట్టి స్వామివారికి ఒడి బియ్యం, పట్టు వస్త్రాలు సమర్పించారు. పట్నాలు వేసి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులుభారీగా తరలి రావడంతో స్వామి వారి దర్శనానికి 6 గంటల సమయం పట్టింది... స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంక్రాంతి పండుగ అనంతరం వచ్చే మొదటి ఆదివారంతో మొదలైన జాతర ఉగాది పండుగ లోపు వచ్చే చివరి ఆదివారాన్ని జాతర వారాలుగా పేర్కొంటారు మొదటి వారాన్ని పట్నం వారంగా పిలువడం అనావాయితీ ఆదివారం హైదరాబాద్ సికింద్రాబాద్ కు చెందిన భక్తులు ప్రత్యేక అలంకరణలతో బోనాలు చేసి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకునేందుకు భారీగా తరలి వచ్చారు శనివారం సాయత్రం నుంచే క్షేత్రానికి భారీగా చేరుకుని మొదట దూళి దర్శనం చేసుకున్నారు.

బోనాలతో బారులు

స్వామికి ప్రీతికరమైన బోనం వండి బోనానికి పసుపు, కుంకుమ, బియ్యంపిండితో అందంగా అలంకరించి ఊరేగింపుగా ఆలయానికి బయలు దేరారు. ఇటు పోలీసు విగ్రహం కూడలినుండి రాజగోపురం వరకు మల్లన్న చెరువు మత్తడి నుండి బస్టాండ్ వరకు, తోటబావి ప్రాంగణం నుండి రాజగోపురం వరకు బోనాలతో కిలోమీటర్ల పొడవునా భక్తులు బారులు తీరారు. ఒంటినిండ బండారి(పసుపు) పూసుకొని చేతిలో వీర గోలలతో భక్తులకు పూనకం వచ్చే విధంగా పోతరాజులుచేసే కేరింతలు విన్యాసాలతో ఆలయ పరిసరాలు దద్దరిల్లాయి, భక్తులు గుట్టపై కొలువైన రేణుక ఎల్లమ్మ గు డికి చేరుకొని అమ్మవారికి బోనాలు కల్లు శాక నైవే ద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కరీంనగర్, వరంగల్, జనగామ జిల్లాలనుండే కాక తెలంగాణలోని పలు జిల్లాల నుండి భక్తులు భారీగా తరలి వచ్చారు. మల్లన్నమొదటి వారంలో భక్తులకు ఇబ్బందులు త లెత్తకుండా సిద్దిపేట పోలీస్ కమీషనర్ డాక్టర్ అనురాధ ఆధ్వర్యంలో హుస్నాబాద్ ఏసీపీ సతీష్, చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి నేతత్వంలో భారీ బందోబ స్తు ఏర్పాటు చేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నాలుగు గంటల నుండి క్యూలైన్లలో వేచి ఉన్నారు. ధర్మ దర్శనంలో భక్తులు 6 గంటలు, ప్రత్యేక దర్శనం లో 4గంటలు, శీఘ్ర దరశనంలో 3 గంటలు.వీ.వీఐపీ దర్శనాలకు 2 గంటలు భక్తులు వేచి ఉన్నారు. -స్వామివారి దర్శనం కోసం దూర ప్రాంతాలనుండి వచ్చిన భక్తులకు ఆలయ అధికారులు పాలక మండలి సభ్యులు సేవలందించారు ఆలయ ఈఓబాలాజీ ధర్మకర్తల మండలి చైర్మన్ లక్ష్మారెడ్డి, ఏఈఓ శ్రీనివాస్ ధర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్, మేడికుంట శ్రీనివాస్, నర్సింహులు, సాయియాదవ్ భక్తులకు సేవలు అందించారు.

కాంగ్రెస్‌లో చేరిన తీగుల్ నర్సాపూర్ సర్పంచ్



నవతెలంగాణ జగదేవపూర్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తప్పనిసరిగా అమలు చేసి ప్రజల రుణం తీర్చుకుంటామని కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి అన్నారు. ఆదివారం జగదేవపూర్ మండల పరిధిలోని తెగులు నర్సాపూర్ గ్రామ పరిధిలో గల కొండపోచమ్మ దేవాలయం వద్ద ఆ గ్రామానికి చెందిన సర్పంచ్ రజిత రమేష్‌తో పాటు 200 మంది కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు శ్రీకాంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం నర్సారెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎంపీని గెలిపించాకోవాలన్నారు. కొండపోచమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేయడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని తెలిపారు. ఈ విషయాన్ని మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కేసిరెడ్డి రవీందర్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జనార్దన్ రెడ్డి, హనుమంత రెడ్డి, కొండపోచమ్మ మాజీ చైర్మన్ బత్తుల మల్లేశం, పిఎసిఎస్ మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి జగదేవపూర్ గ్రామ సర్పంచ్లు కొత్త లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి , పీర్లపల్లి ఎంపీటీసీ మహేందర్ రెడ్డి, గొల్లపల్లి ఎంపిటిసి మహేష్, అలిరాజి పేట సర్పంచ్ లక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి, గాల్ రెడ్డి, ఎండి పాషా, దయాకర్ రెడ్డి, అమర రాము, కొత్త నరసింహారెడ్డి, నరసింహారెడ్డి ,మల్లికార్జున్ రెడ్డి, ఎండి అజీజ్, వెంకటేష్, రాగుల రాజు, దండే వెంకటేశం, వెంకటస్వామి, ఎండి మునీర్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల చేతగానితనం.. కుంటుపడిన గజ్వేల్ అభివృద్ధి



నవ తెలంగాణ -గజ్వేల్

బీఆర్ఎస్ పార్టీ నేతల చేతగానితనంతో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధి కుంటుపడిందని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్ విమర్శించారు. ఆదివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పాలకవర్గ పుణ్యకాలం మొత్తం కుట్రల కుతంత్రాలకే పోయింది అన్నారు. జరగాల్సిన అభివద్ధి పనులు అన్నీ నిలిచిపోయాయి పనులు నిలిచిపోయేలా చేసిన మాజీమంత్రి హరీష్ రావు గజ్వేల్ అభివద్ధిపై మాట్లాడడం విడ్డూరం ఉందన్నారు. గజ్వేల్ సవతి ప్రేమ చూపుతూ హరీష్ రావు మొసలి కన్నీరు కారుస్తున్నారు అన్నారు. సిద్దిపేట తో పోలిస్తే గజ్వేల్ పై హరీష్ రావు సవతి తల్లి ప్రేమ చూపించారు అన్నారు. త్వరలోనే గజ్వేల్ మున్సిపల్ పరిధిలో కౌన్సిల్ సభ్యులు అవిశ్వాసం పెట్టే అవకాశం ఉందన్నారు. కొత్త ప్రభుత్వమైనా అసంపూర్తి పనుల మీద దృష్టి పెట్టాలన్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల అవినీతిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు కుడిక్యాల రాములు, నత్తి శివకుమార్, గుర్రం శ్రీధర్, హరికష్ణ, శ్రీకాంత్ గౌడ్ తదితరులున్నారు.

20 వేల నాణాలతో అయోధ్య రామ మందిరం



నవ తెలంగాణ - గజ్వేల్

రామ నామమే ప్రాణమని నమ్మిన రామ భక్తుడు వినూతన ఆలోచనతో అయోధ్య మందిరాన్ని 20 వేల నాణాలను ఉపయోగించి రామకోటి రామరాజు చిత్రీకరించారు. 10 అడుగుల పొడవు 8అడుగుల వెడల్పుతో అత్య అద్భుతంగా అయోధ్య రామ మందిరాన్ని 3రోజులు శ్రమించి భక్తితో చిత్రించి ఆదివారం రామకోటి కార్యాలయంలో పూజలు జరిపి ఆవిష్కరించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు చిత్రీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోట్లాది హిందువుల కళ నెరవేరుతున్న శుభ సందర్భంగా ఆ రామ మందిరాన్ని చిత్రించానన్నాడు. గత 25సంవత్సరాల రామ నామమే ప్రాణమని రామ నామాన్ని లిఖిస్తున్న మా రామకోటి భక్తులకు అంకితమన్నాడు. ఇందులో అన్ని రకాల నానాలను ఉపయోగించి చిత్రించానన్నారు. భక్తుల సందర్శనార్థం 2రోజులు రామకోటి కార్యాలయంలో ఉంచబడునన్నారు. రామ భక్తులు వచ్చి సందర్శించాలన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
సోమవారం | 22 జనవరి 2024 | www.navatelangana.com

ఇచ్చిన హామీని ఎమ్మెల్యే నిలబెట్టుకోవాలి

గుగ్గిళ్ల గ్రామస్తుల డిమాండ్



నవతెలంగాణ-బెజ్జంకి

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయిస్తానని మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని గుగ్గిళ్ల గ్రామస్తులు డిమాండ్ చేశారు. అదివారం మండల పరిధిలోని గుగ్గిళ్ల గ్రామస్తులు సమావేశం ఏర్పాటు చేసుకుని తమ గ్రామ శివారులో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ పరిశ్రమ అనుమతులు రద్దు చేసేల ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తక్షణమే ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లాలని గ్రామస్తులు అభ్యర్థించారు.

విశ్వ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-సిద్దిపేట



పట్టణంలోని మార్కండేయ దేవాలయంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విశ్వ హాస్పిటల్‌కు చెందిన డా.సంపత్ కుమార్ గౌడ్, డాక్టర్ శ్రీ లక్ష్మీ, డాక్టర్ మమత రెడ్డిల వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షులు కాముని రాజేశం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పట్టణ పద్మశాలి కుటుంబ సభ్యుల కోసం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జనరల్ ఫిజీషియన్ కన్సల్టెంట్, జనరల్ సర్జన్ కన్సల్టేషన్, కంటి వైద్య నిపుణులు, ఆర్థో కన్సల్టేషన్ ఎముకల వైద్య నిపుణులు, ఉచిత షుగర్ పరీక్షలు, ఉచిత బీపీ చెకప్, ఉచిత డెంటల్ చెక్ అప్, చిగుళ్ల వ్యాధి సంబంధిత చెక్ అప్‌తో పాటు మందులు కూడా ఉచితంగా ఇవ్వడం జరిగిందని తెలిపారు. అనంతరం వైద్యులను సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రవితేజ తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలకే పగుళ్లు

- నాసిరకంగా సీసీ రోడ్డు నిర్మాణం
- అధికారుల నిర్లక్ష్యం
- కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం
- కోట్ల ప్రజాధనం వృథా
- ఇబ్బందుల్లో ప్రజలు









నవతెలంగాణ - ఝరాసంగం

గ్రామాల్లో సీసీరోడ్లు, కల్వర్టు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తోంది. కాంట్రాక్టర్లు అధికారులతో కుమ్మక్కై నాసిరకం పనులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సీసీ రోడ్లు వేసిన కొంత కాలనికే కంకర తేలి గుంటలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక లేకుండా డస్ట్ పౌడర్ వాడటం, రోబో శాండ్ వాడి దానికి తగ్గటుగా సిమెంట్ వాడకపోవడంతో రోడ్డు వేసిన కొన్ని రోజులకే కంకర తేలి గుంతలు ఏర్పడుతోందని వాపోతున్నారు. మండలంలోని కక్కరవాడ గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధుల కింద మూడు నెలల క్రితం వేసిన సీసీ రోడ్డుకు అప్పుడే పగుళ్లు ఏర్పడాయి. రూ.20 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్డు, కల్వర్టు, మురుగు కాల్వల నిర్మాణం చేపట్టారు.. ఇందులో సీసీ రోడ్డు పనులు చేపట్టే సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో పగుళ్లు వచ్చాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు



రోడ్లు వేసే సమయంలో పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలి. రోడ్లు నిర్మించే సమయంలో అధికారులు పర్యవేక్షించకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సీసీ రోడ్లు వేసే ముందు రోడ్డుకు రెండు వైపులా సీసీ మిక్సింగ్ బయటకు వెళ్లకుండా చానల్స్ వాడతారు. వాటిని నేలపై హెచ్చు తగ్గులు లేకుండా సరిచేసి పాలిథిన్ కవర్ వేసి సరిచేయాలి. సీసీ రోడ్డును ఎక్కువ మందంగా చూపించేందుకు ఆ చానళ్ల వద్ద గుంతలు తీసి సీసీ మెటీరియల్ పోస్తారు. అలా చేయడంతో కాంట్రాక్టర్లు పోసే సీసీ మెటిరియల్ తక్కువ పడుతుంది. చూసే వారికి రోడ్డు మందంగా కనిపిస్తుంది. కాంట్రాక్టర్లు చేయనిపనికి కూడా బిల్లు తీసుకుంటారని సమాచారం. కొందరు కాంట్రాక్టర్లు చేసే పనులలో ఏ మాత్రం నాణ్యత ఉండటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సీసీ, డ్రైనేజీ పనులలో ఇసుక లేకుండానే డస్ట్ పౌడర్ లేదా రోబో శాండ్ వాడుతున్నారు. కంకరకు తగ్గట్టుగా సిమెంట్ వాడటం లేదు. సీసీ రోడ్ల కింద పాలిథిన్ కవర్ లేకుండానే పనులు చేయడంతో వేసిన రోడ్లు కొంత కాలానికే వాహనాలు తరచూ తిరగడం వలన కంకర తేలి గుంతలమయంగా మారుతున్నాయి. ఇంత జరుగుతున్నా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ఏ మాత్రం పర్యవేక్షించడం లేదు. 'ఏ విధంగా కంకర సిమెంట్ ఇసుక కలుపుతున్నారు. చూసుకొనే బాధ్యత అధికారులకు లేదా? వారు ఎందుకు పరిశీలించడం లేదు. క్వాలిటీగా పనులు చేస్తే అధికారులకు రావాల్సిన కమీషన్ రాదనే భయంతోనే అటువైపు కన్నెత్తి చూడటం లేదు' అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారుల జాడేదీ?

గతంలో పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ అధికారులు అందరూ మండల పరిషత్ కార్యాలయంలో ఉండేవారు. ప్రతిరోజు ఆఫీస్‌కు వచ్చి వారి పరిధిలో జరిగే పనులను పరిశీలించేందుకు ఆ ఆఫీస్‌లోని రిజిస్టర్‌లో ఎక్కడికి వెళ్తునారో రాసి అక్కడ ఉన్న ఎంపీపీకి చెప్పి వెళ్లేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకుండా పోయింది. పంచాయతీ రాజ్ డీఈ ఆఫీస్‌లో ఉండటంతో వారు ఆఫీస్‌కు వెళ్తున్నారా..! ఇంటి వద్దనే ఉంటున్నారా..? ఫీల్డ్ మీదకు వెళ్తున్నారా..? అనేది తెలియని పరిస్థితి. ఫోన్ చేస్తే ఫీల్డ్ మీదకు వేళ్తున్నామని ఉన్నతాధికారులకు చెబుతున్నారు. అలాంటి పరిస్థితులు రాకూడదని, ప్రజల సౌకర్యార్థం మండల కేంద్రంలోని ఐకెపి భవనంలో న్యాల్కల్, ఝరాసంగం మండలాలకు సంబంధించి పి.ఆర్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని గత మూడు నెలల క్రితం ఎమ్మెల్యే ప్రారంభించారు. అప్పటి నుండి ఒక్క అధికారి కూడా కార్యాలయానికి రావడం లేదు. ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు.

ముడుపులు చెల్లిస్తేనే బిల్లులు

'ప్రజా ప్రతినిధులు, కాంట్రాక్టర్లు చేసిన పనులను అధికారులకు కమీషన్ల ఇస్తేనే బిల్లులు చేస్తారు. కిందిస్థాయి సిబ్బంది నుంచి ఉన్నత స్థాయి అధికారులకు చేసిన పనులలో పర్సంటేజీ ఇవ్వనిది పనులు చేయరు. పనుల కోసం ఎన్నిసార్లు తిరిగినా మోహమాటం లేకుండా మా కమీషన్ మాకు ఇవ్వాల్సిందేనని హుకుం జారీ చేస్తారు' అని తమ గోడును కాంట్రాక్టర్లు వివరించడం గమనార్హం. ఈ విషయమై గత సర్వసభ సమావేశంలో ఎంపీపీ సైతం సంబంధిత శాఖ అధికారిపై ఫైరయ్యారు. సీసీ రోడ్డు పనుల్లో భాగంగా



చేపట్టిన కల్వర్టు నిర్మాణం పనులు అసంపూర్తిగా ఉన్నా పూర్తి బిల్లులు కాంట్రాక్టర్‌కు అందజేశారనే విమర్శలు వస్తున్నాయి. జిల్లా అధికారులు ఈ విషయమై స్పెషల్ ఫోకస్ పెట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జేపీ తండాలో ఓటు హక్కు కోసం దరఖాస్తులు



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం జేపీ తండా గ్రామంలో ఆదివారం కొత్త ఓటింగ్ నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ భిక్షపతి నాయక్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్, ఆశావర్కర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సాముహిక హనుమాన్ చాలీసా పారాయణం



నవతెలంగాణ-నంగునూరు

అయోధ్యలో బాల రాముడి ప్రతిష్టాపనను పురస్కరించుకొని ఆదివారం నంగునూరు గ్రామంలో హనుమాన్ దేవాలయంలో సాముహిక 108 హనుమాన్ చాలీసా పారాయణం కావించారు. ఈ కార్యక్రమంలో హన్మంతారెడ్డి, సాదుల రాజు, చేగూరి నర్సింలు, జంగిటి అనిల్ , మనోజ్ కుమార్, పవన్ భక్తులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని దాచారం గ్రామానికి చెందిన దయ్యాల కనుకవ్వకు వైద్య చికిత్స నిమిత్తం రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని ఆదివారం మానకొండూర్ నియోజవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అందజేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. వైద్య చికిత్స కోసం ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే సత్యనారాయణకు బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. రెండో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ నాయకులు పులి కృష్ణ, దాచారం గ్రామ శాఖాధ్యక్షుడు రంగోని రాజు, మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, నాయకులు జెల్లా ప్రభాకర్, బైర మహేందర్, అమరగొండ రాజు, బోడిగే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలకు బ్యాంకు ఖాతా తప్పనిసరి

నవతెలంగాణ-తొగుట



కేంద్ర ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందేందుకు ప్రతి ఒక్కరికి బ్యాంకు ఖాతా అవసరమని ప్రజాప్రతినిధులు, అధికారులు సూచించారు. ఆదివారం మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామంలో భారత్ వికాసిత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు బ్యాంకు ఖాతా తీసుకోవడం వల్ల చాలా ఉపయోగాలు ఉంటాయన్నారు, కుటుంబ బడ్జెట్, వ్యక్తి బడ్జెట్, బ్యాంక్ ఖాతా రకాలు, ఇ-కేవైసీ, నామిని ప్రాముఖ్యత వంటి వాటితో మేలు చేకూరుతుందన్నారు. బీమా రకాలు, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, ఉజ్వల, ఆయుష్మాన్ భారత్, విష్వకర్మా యోజన తదితర బీమా రకాలు వినియోగదారులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రుణాలు, రైతులు పంట రుణాలు, ముద్ర రుణాలు, వ్యక్తిగత రుణాలు, విద్యా రుణాలు, డిజిటల్ లావాదేవీలు, రూపాయి ఎటిఎం కార్డ్ యుటిలిటీస్ గురించి గ్రామ ప్రజలతో చర్చించామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిద్దిపేట భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి, జిల్లా వికసిత్ భారత్ జిల్లా కోఆర్డినేటర్ విభీషణ్ రెడ్డి, వికసిత్ భారత్ మండల్ కోఆర్డినేటర్, చందాపూర్ సర్పంచ్ బొడ్డు నరసింహులు యాదవ్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ నోడల్ ఆఫీసర్, ఎల్లారెడ్డిపేట సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, ఉప సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షులు ఐలిగొండ చంద్రశేఖర్, బీజేవైఎం మండల అధ్యక్షులు కళ్యాణ్ దాస్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు ఆంజనేయులు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో నేడు కళ్యాణోత్సవం



నవ తెలంగాణ-మిరుదొడ్డి

ఎన్నో సంవత్సరాల హిందువుల కల సోమవారం నెరవేరుతుందని శ్రీరామ తీర్థ క్షేత్ర నిర్వాహకుడు కానుగంటి శ్రీనివాస్ అన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో కమిటీ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అయోధ్యలో రామ మందిరం నిర్మాణంతో పాటు విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు కళ్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కంకణాల నర్సింలు

నవతెలంగాణ-తొగుట



బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నాయకుడు కంకణాల నర్సింలు అన్నారు. ఆదివారం మండలంలోని వేంకట్రావుపేట గ్రామంలో గత శుక్రవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందిన సపాయి కార్మికుడు ఈదుగాళ్ల భిక్షపతి, మూడు రోజుల క్రితం మృతి చెందిన కళ్లెపు చంద్రయ్యల కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడు భిక్షపతి భార్య మల్లవ్వ, కుమారుడు మల్లేశంను, చంద్రయ్య భార్య సత్తవ్వ, మనుమడు నవీన్‌లను ఓదార్చారు. రూ.3000 చొప్పున ఇరు కుటుంబ సభ్యులకు వేర్వేరుగా ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కత్తుల రమేష్, కొయ్యడ నరేందర్, బొగ్గుల నర్సింలు, బి.దయాకర్, కళ్లెపు భాస్కర్, వడ్డే స్వామి, నర్సింలు, పోచయ్య, భూపతి, రాములు, లక్ష్మణ్, రాములు, బండారి కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

28న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక



నవ తెలంగాణ-సిద్దిపేట

స్థానిక శివానుభవ మంటపంలో ఈ నెల 28న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేశామని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంస్థ (టిబిఎస్ఎస్) అధ్యక్షులు వెల్దండ బల్వంతరావు తెలిపారు. ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ బ్రాహ్మణ సేవా సంస్థ, సిద్దిపేట బ్రాహ్మణ సంఘం, సిద్దిపేట జిల్లా బ్రాహ్మణ యువసేన ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివాహం కోసం ఎదురుచూసే వధు వరులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని తమ పేర్లను నమోదు చేసుకొని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కోశాధికారి అమిత్ దేశ్ పాండే, కార్యవర్గ సభ్యులు వట్టిపల్లి అశోక్ రావు, అన్నమ్మ రాజు శ్రీనివాస రావు, సిద్దిపేట బ్రాహ్మణ ధార్మిక పరిషత్ అధ్యక్షులు కోటి రామేశ్వర రావు, సిద్దిపేట జిల్లా బ్రాహ్మణ యువసేన అధ్యక్షులు గండికోట రాజు శర్మ, కార్యదర్శి కామర్స్ సోమసుందర్ శర్మలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీని సాగనంపినా తీరు మారడం లేదు

కాంగ్రెస్ మండల అధికారి ప్రతినిధి కృష్ణ గౌడ్

నవ తెలంగాణ- రాయపోల్

తెలంగాణ రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్ పార్టీని అధికారం నుంచి ఇంటికి సాగనంపినా వారి తీరు మాత్రం మారడం లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి కృష్ణ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికలలో వంద రోజులలో ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేసి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించడం జరుగుతుందన్నారు. పది సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం వాళ్లు ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్రాన్ని అవినీతిమయం చేసి అప్పులకుప్పగా మార్చారన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తామని లక్ష కోట్ల రూపాయలతో నిర్మాణం చేశారు. అదికాక కాళేశ్వరం ప్రాజెక్టులో మొత్తం అవినీతి అక్రమాల చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ప్రాజెక్టు నిర్మాణం చేసి ఐదు సంవత్సరాలు కూడా గడవకముందుకే నిర్మాణంలో డొల్లతనం బయటపడిందన్నారు. అలాంటి బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలు అమలు చేయడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటన్నారు. 6 గ్యారంటీ పథకాలలో ఇప్పటికే రెండు పథకాలు అమలవుతున్నాయన్నారు. రానున్న రోజులలో పూర్తిగా ప్రజాపాలన అందిస్తూ ప్రజలకు 6 గ్యారంటీలను అందించే బాధ్యత కాంగ్రెస్ పార్టీదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిజమైన సంక్షేమం, అభివృద్ధి చేసి ఉంటే మూడవసారి కూడా ప్రజలు అధికారం కట్టపెట్టేవారన్నారు. బీఆర్ఎస్ పాలన మొత్తం అవినీతి పాలన కాబట్టే ఇంటికి పంపించారన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకొని ప్రతిపక్ష పార్టీగా సరైన సలహాలు, సూచనలు చేయాలని పేర్కొన్నారు.

